విశాఖపట్టణం
శనివారం18 ఏప్రిల్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in | సంపుటి: 9 | సంచిక: 84 | వెల: రూ.5/- | పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# లండన్‌కు జగన్

## 15 రోజుల పాటు పర్యటన.. విదేశీ పర్యటనకు కోర్టు అనుమతి

(హైదరాబాద్ - జయజయహే)



మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి యూకే పర్యటనకు వెళ్లనున్నారు. యూకే వెళ్లేందుకు అనుమతి కోరుతూ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి యూరోఫ్, యూకే వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని జగన్ మోహన్ రెడ్డి కోర్టును కోరారు. దీంతో ఈనెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు దాదాపు ..మిగతా 2లో



# డేంజర్ డేస్..!

## ఉక్కపోత.. ఉక్కిరిబిక్కిరి

## చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీలు దాటే ఛాన్స్

## మే, జూన్‌లో మరింత తీవ్రం

## వాతావరణ శాఖ హెచ్చరికలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండలకు తోడు ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ముఖ్యంగా మధ్యాహ్నం సమయాల్లో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు బయటకు రావొద్దని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వస్తే ఎండ నుంచి రక్షణగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయితే, తాజాగా.. మరో కీలక అప్డేట్ వచ్చింది. పలు విదేశీ వాతావరణ సంస్థలు సంచలన విషయాలను వెల్లడించాయి. భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రస్తుతం ..మిగతా 2లో

# వీళ్లు తగ్గారా.. వాళ్లు నెగ్గారా..!?

## వీగిపోయిన మహిళా బిల్లు

## తమ పోరాటమే ఫలితమే అంటున్న ఇండీ కూటమి

## ఎన్డీఏ వ్యూహాత్మకమా అనే అనుమానం

## మహిళా బిల్లుపై సందిగ్ధతలో జనం






(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగసవరణ బిల్లు లోక్ సభలో వీగిపోయింది. ప్రత్యేక మెజారిటీ 352 ఓట్లు లభించకపోవడంతో వీగిపోయినట్లుగా స్పీకర్ ప్రకటించారు. బిల్లుకు అనుకూలంగా మెజారిటీ 298 సభ్యులు ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన 2/3 వంతు మద్దతును కూడగట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. బిల్లుపై జరిగిన చర్చలో హోం మంత్రి అమిత్ షా , విపక్ష నేతల మధ్య ఆసక్తికరమైన వాదనలు నడిచాయి. లోక్‌సభ స్థానాలు 50 శాతం పెరుగుతాయని గురించి స్పష్టత లేదని విపక్షాలు ప్రశ్నించగా.. ఇప్పుడే బిల్లులో ఆ మార్పు చేస్తే మద్దతిస్తారా అని అమిత్ షా సవాల్ విసిరారు. దీనికి ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్ సానుకూలంగా స్పందించినప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా వెనక్కి తగ్గకుండా నేరుగా ఓటింగ్‌కే మొగ్గు చూపడం గమనార్హం. ఈ పరిణామం ప్రభుత్వం పట్టుదలకు పోయిందా లేదా విపక్షాల చిత్తశుద్ధిని పరీక్షించాలనుకుందా అనే చర్చకు దారితీసింది. రాజ్యాంగ సవరణను ఆమోదించుకోవడానికి సాధారణంగా తెరవెనుక జరిగే దౌత్య ప్రయత్నాలు ఈసారి ఎన్డీయే కూటమి పెద్దగా చేసినట్లు కనిపించలేదు. కేవలం సభా వేదికగా సభ్యులకు విజ్ఞప్తి చేయడమే తప్ప, తటస్థ పార్టీలను లేదా అసంతృప్త సభ్యులను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేయకపోవడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. ప్రస్తుత రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంతో ప్రభుత్వం తన పంథాను మార్చుకుంది. 2023లో ..మిగతా 2లో

# ప్రత్యేక హోదా సంగతేంటి..?

## విభజన చట్టం కాగితాలకే పరిమితం

## ఏపీకి కేంద్రం న్యాయం చేయాల్సిందే

## లోక్ సభలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి ప్రసంగం



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

విభజన జరిగి ఇన్నేళ్లు గడుస్తున్నా, నాటి పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని కేంద్ర ప్రభుత్వం విస్మరించడంపై మిథున్ రెడ్డి లోక్‌సభలో ప్రస్తావించారు. డిలిమిటేషన్ అంశంపై చర్చలో ఆయన పాల్గొన్నారు. ఏపీ పునర్విభజన చట్టంలోని కీలక అంశాలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయని, హోదా ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రం ఆర్థికంగా ఎంతో నష్టపోయిందన్నారు. లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై మిథున్ రెడ్డి కీలక డిమాండ్లు లేవనెత్తారు. డీలిమిటేషన్ విషయంలో ప్రభుత్వం చెబుతున్న హామీలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా, లిఖితపూర్వకంగా బిల్లులో పొందుపరచాలని కోరారు. ప్రాంతీయ అసమానతలకు తావులేకుండా, అన్ని రాజకీయ పార్టీలకు సమన్యాయం జరిగేలా ఈ ప్రక్రియ ..మిగతా 2లో




## మే మొదటి వారంలో

# టెన్త్ ఫలితాలు

## విద్యాశాఖ కసరత్తు

(అమరావతి - జయజయహే)

ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలయ్యాయి.. ఎక్స్ వేదికగా ఈనెల 15వ తేదీన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేశారు. అయితే, ఇప్పుడు అందరి దృష్టి పదో తరగతి ఫలితాలపై పడింది. ఈ క్రమంలో టెన్త్ ఫలితాల విడుదలపై విద్యాశాఖ నుంచి కీలక అప్డేట్ వచ్చింది. ఏపీలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 2026 ఏప్రిల్ 3వ తేదీతో ముగిసిన విషయం ..మిగతా 2లో



# అనాగరిక.. ఆటవిక ప్రవర్తన

## ఇతరుల గౌరవ ప్రతిష్ఠలను దెబ్బ తీసే హక్కు లేదు

## వాక్ స్వాతంత్రం, భావస్వేచ్ఛకు పరిమితులున్నాయి

## సజ్జల భార్గవ్ రెడ్డి పిటీషన్ పై హైకోర్టు మండిపాటు

## దర్యాప్తు సక్రమంగా చేసి నిందితులను శిక్షించాలని ఆదేశం

(అమరావతి - జయజయహే)

వైసీపీ సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జ్ సజ్జల బార్గవ్ రెడ్డి , ఇతర నిందితులది ఆనాగరిక, ఆటవిక ప్రవర్తన అని ఇతరుల గౌరవ ప్రతిష్ఠలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో భార్గవ్ రెడ్డిపై న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు ..మిగతా 2లో

# ఇంతకీ 16 వెనుక ఏముంది..?

## 16 సంఖ్యలోనే అన్నీ ఉన్నాయన్న రాహుల్

## ఏమై ఉంటుందా అని సభ్యులు ఆరా


## టీడీపీ ఎంపీల సంఖ్యాబలమా అని చర్చ



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 16 అనే సంఖ్యను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై చేసిన విమర్శలు సభలో ఆసక్తికర చర్చకు దారితీశాయి. నిన్నటి సభలో ప్రధాని ప్రసంగాన్ని తాను గమనించానని, ఆయనలో ఉత్సాహం లోపించిందని, మాటల్లో స్పష్టత లేదని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధాని ఎందుకు అలా నీరసంగా ఉన్నారో అర్థం కాక ఆలోచిస్తుండగా, తన ఫోన్‌లో తేదీ చూడగా అది ఏప్రిల్ 16 అని కనిపించిందని, ఆ 16 సంఖ్యలోనే అన్ని సమాధానాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మహిళా ..మిగతా 2లో

## లిక్కర్ స్కామ్‌లో వాసుదేవరెడ్డికి బెయిల్



2

## ఎస్ఈసీగా

# అనిల్ పునేఠా

## ప్రభుత్వ ప్రతిపాదనకు గవర్నర్ ఆమోదం

## స్థానిక ఎన్నికల నేపథ్యంలో కీలక బాధ్యతలు

(అమరావతి - జయజయహే)



రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్ చంద్ర పునేఠా నియామకానికి ఆమోదం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోద ముద్ర వేశారు. మరికొద్ది సేపట్లోనే అనిల్ చంద్ర పునేఠాను ఎస్ఈసీగా నియమిస్తూ ..మిగతా 2లో

# డేంజర్ డేస్..!

మొదటి పేజీ తరువాయి...

40 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే, రాబోయే రోజుల్లో 45డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, మే, జూన్ నెలల్లో ఎండలు మరింత తీవ్ర మవుతాయని నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రధానంగా విదేశీ వాతావరణ సంస్థల మోడళ్లు అంచనా ప్రకారం.. భారత దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు కూడా దాటిపోతాయని, దేశం ఎదుర్కొనే అత్యంత తీవ్రమైన వేసవిలో ఈ ఏడాదీ ఒకటి కావొచ్చునని అంచనా వేశారు. వాతావరణ అనిశ్చితితో వర్షాలు కురిస్తే తప్ప వేడి నుంచి ఉపశమనం లభించడం కష్టమేనని అంటున్నారు. వచ్చే రెండు వారాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పలు వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. ఈ సీజన్లో ఉత్తరాదిలో ఉన్న అధిక పీడనం ప్రభావంతో ఉత్తర, మధ్య భారతంలో ఉన్న వేడిగాలులు దక్షిణాది రాష్ట్రాలపైకి వీస్తున్నాయని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు. ఇదిలాఉంటే ఏపీలోనూ ఎండలు తీవ్రత పెరిగింది. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం నంద్యాల జిల్లాలోని సంజమాలలో 45డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లాలోని ఒంటిమిట్టలో 44.9డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే కాలంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం కూడా ఏపీలోని పలు ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. మన్యం, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గరిష్ఠంగా 43డిగ్రీల నుంచి 44.5డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు మధ్యాహ్నం వేళల్లో బయటకు రావొద్దని



హెచ్చరించింది. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినా ఎండ వేడిమి నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. మరోవైపు... ఇవాళ మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి, పోలవరం జిల్లాల్లోని సుమారు 30 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 55 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.



## ప్రత్యేక హోదా సంగతేంటి..?

మొదటి పేజీ తరువాయి...

ఉండాలని సూచించారు. ముఖ్యంగా, డీలిమిటేషన్ అనేది విపక్షాలను అణచివేసే సాధనంగా మారకూడదని, ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుతూ సమతుల్యంగా జరగాలని ఆయన స్పష్టం చేశారు.మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించిన మిథున్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం మహిళా సాధికారతకు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలను సభ దృష్టికి తీసుకెళ్లారు. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటికే 50 శాతం రిజర్వేషన్లు కల్పించామని, సంక్షేమ పథకాలు మరియు ఇళ్ల పట్టాల పంపిణీలో మహిళలకే అగ్రతాంబూలం ఇస్తున్నామని వివరించారు. దేశవ్యాప్తంగా మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో, క్షేత్రస్థాయిలో మహిళల రక్షణ విషయంలో ప్రభుత్వ తీరును ఆయన తప్పుబట్టారు. అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు మహిళలను వేధిస్తున్నా, వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, ఫిర్యాదు చేసిన వారిపైనే కేసులు పెట్టడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులను అంగీకరిస్తున్నప్పటికీ, మహిళా భద్రత , డీలిమిటేషన్ అంశాల్లో తాము లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించాలని మిథున్ రెడ్డి డిమాండ్ చేశారు. స్పేస్ లేకపోయినా.. ప్రత్యేకహోదా అంశాన్ని మిథున్ రెడ్డి ప్రస్తావించడం వెనుక ప్లాన్ ఉందని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికలకు ఓ ఎజెండా సెట్ చేయడానికి ప్రయత్నిస్తున్న వైసీపీ హైకమాండ్ ఈ మేరకు.. ఒక్కో అంశాన్ని టెస్ట్ చేస్తున్నారని.. ప్రత్యేకహోదా అంశంపై ప్రజల్లో కదలిక వస్తే దాన్ని ఎంచుకునే వ్యూహం ఉందని భావిస్తున్నారు.

## ఎస్ఈసీగా అనిల్ పునేఠా

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వం జీఓను విడుదల చేయనుంది. అనిల్ చంద్ర పునేఠా గతంలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం ఆయన విజిలెన్స్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గవర్నర్ ఆమోదం లభించడంతో ప్రభుత్వం కాసేపట్లో అధికారిక జీఓ జారీ చేసి.. అనిల్ చంద్ర పునేఠాకు పూర్తి బాధ్యతలు అప్పగించనుంది. పంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్తుల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ నియామకం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అనిల్ చంద్ర పునేఠా ఐఏఎస్ 1984 బ్యాచ్ అధికారి. రాష్ట్రంలో వివిధ కీలక శాఖల్లో పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. గతంలో కొన్ని సందర్భాల్లో ఎన్నికల సంబంధిత బాధ్యతలు కూడా నిర్వహించిన విషయం తెలిసిందే. జీఓ విడుదలైన వెంటనే అధికారికంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా అనిల్ చంద్ర పునేఠా బాధ్యతలు చేపట్టనున్నారు.



## జి అగ్రహారంలో జలధార కార్యక్రమాలు పరిశీలించిన ఎండిఓ

మాడుగుల ఏప్రిల్ 17 జయ జయహే

జలధార జలహారతి పథకములో భాగంగా మాడుగుల మండలం గొట్టివాడ అగ్రహారశీ గ్రామశీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎండిఓ కే అప్పారావు గ్రామ కార్యదర్శి తో కలిసి పరిశీలించారు. ఈ చెరువులో120 మంది ఉపాధి శ్రామికులకు ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నారు. వారి అందరి హాజరు నమోదు కేవలం ఫేషియల్ యాప్ ద్వారా మాత్రమే నమోదు జరుగుతుందని చెప్పారు.ఈ సందర్భంగా ఈ హాజరును పరిశీలించిన ఆయన ఉపాధి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

## ఇంతకీ 16 వెనుక ఏముంది..?

మొదటి పేజీ తరువాయి...

రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లును ప్రస్తుత తరుణంలో తీసుకురావడం ప్రభుత్వానికి ఒక పెద్ద తప్పిదమని, ఆ విషయం ప్రభుత్వానికి కూడా అర్థమైందని రాహుల్ గాంధీ విమర్శించారు. అందుకే ప్రధాని ముఖంలో ఆందోళన కనిపిస్తోందని, ఈ బిల్లు వల్ల తలెత్తబోయే పరిణామాలను చూసి ప్రభుత్వం భయపడుతోందని ఎద్దేవా చేశారు. ఈ మొత్తం చిక్కుముడికి 16వ తేదీనే సమాధానమని ఆయన నిగూఢంగా వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ 16 సంఖ్యను ఒక చిక్కుముడిలా ప్రస్తావించడం వెనుక లోతైన రాజకీయ వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధానంగా ఏప్రిల్ 16వ తేదీన మహిళా రిజర్వేషన్ చట్టం 2023ను ప్రభుత్వం హడావిడిగా నోటిఫై చేయడంపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్లమెంటులో బిల్లుపై చర్చ జరుగుతుండగానే, నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా ప్రభుత్వం సభను తక్కువ చేసి చూపిస్తోందని, ఈ 16వ తేదీనే ప్రభుత్వ పతనానికి, వారి తప్పుడు నిర్ణయాలకు సంకేతమని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. మరో ఆసక్తికరమైన కోణం ఏమిటంటే.. ప్రస్తుత సంకీర్ణ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ బలాన్ని రాహుల్ గాంధీ ఈ సంఖ్య ద్వారా గుర్తుచేశారనే చర్చ నడుస్తోంది. లోక్‌సభలో టీడీపీకి ఉన్న 16 మంది ఎంపీల మద్దతుపైనే కేంద్ర ప్రభుత్వం నిలబడి ఉందని, ఆ 16 మంది సభ్యులు తలచుకుంటే ఏ క్షణమైనా పరిస్థితి మారిపోవచ్చనే అర్థం వచ్చేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ ఎంపీల సంఖ్యే ప్రభుత్వానికి లైఫ్ లైన్ అని ఆయన పరోక్షంగా గుర్తుచేశారు. అంతేకాకుండా, ఈ 16వ తేదీనే దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్తును తేల్చే నియోజకవర్గాల పునర్విభజన చర్చలు ఊపందుకోవడం కూడా ఒక కారణం కావచ్చని విశ్లేషణలు వస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల ఉనికిని దెబ్బతీసేలా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దానికి ఏప్రిల్ 16వ తేదీ ఒక సాక్ష్యమని రాహుల్ అభిప్రాయపడ్డారు. మొత్తం మీద, రాహుల్ ప్రస్తావించిన ఆ 16 సంఖ్య అటు ప్రభుత్వానికి ఉన్న మెజారిటీని, ఇటు దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను ఒకేసారి గుర్తు చేస్తూ అధికార పక్షంలో గుబులు రేపిందని భావిస్తున్నారు.

## అనాగరిక.. ఆటవిక ప్రవర్తన

మొదటి పేజీ తరువాయి...

చేసింది. తనపై జారీ చేసిన ఎల్‌ఓసీని రద్దు చేయాలని కోరుతూ సజ్జల భార్గవ్ రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రుల కుటుంబ సభ్యుల ప్రతిష్ఠకు భంగం కలిగించే పోస్టులు ఎలా పెడతారని న్యాయస్థానం ప్రశ్నించింది. వాక్ స్వాతంత్రం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు పరిమితులు ఉన్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తును సక్రమంగా చేసి నిందితులకు శిక్షపడేలా చేయాలని పోలీసులను ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కోరినప్పుడు విచారణకు హాజరు అవుతానని అఫిడవిట్ వేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఎల్‌ఓసీని రీ కాల్ చేయాలని అన్నమయ్య జిల్లా ఎస్పీకి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అభ్యర్దన వచ్చిన వెంటనే ఎల్‌ఓసీని రద్దు చేయాలని ఇమిగ్రేషన్ అధికారులకు ఏపీ హై కోర్టు ఆదేశించింది.

## లండన్‌కు జగన్

మొదటి పేజీ తరువాయి...

25రోజుల పాటు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు సీబీఐ కోర్టు జగన్ కు అనుమతి ఇచ్చింది. దేశం విడిచి వెళ్లేముందు కాంటాక్ట్ నెంబర్, ఈమెయిల్ ఐడీ, ష్యూరిటీ సీబీఐ అధికారులకు అందజేయాలని కోర్టు సూచించింది. అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి దేశం విడిచి వెళ్లాలంటే సీబీఐ న్యాయస్థానం అనుమతి తప్పనిసరి. గతంలో జగన్ విదేశీ పర్యటనకు వెళ్లిన పలు సందర్భాల్లో సీబీఐ కోర్టు అనుమతి తీసుకున్నారు. తాజాగా.. యూరోప్, యూకే పర్యటనలకు వెళ్తున్న జగన్.. సీబీఐ కోర్టును అనుమతి తీసుకున్నారు.



## మాస్టర్ పల్లా వెంకటేష్ సేవలు మరువలేనిది

విశాఖపట్నం (జయ జయహే)

గాయకుడిగా, సంగీత సేవా సంస్థల అధినేతగా పల్లా వెంకటేష్ మాస్టర్ కళా రంగానికి చేసిన సేవలు మరువలేనిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ద్వారకానగర్ విశాఖ పౌర గ్రంథాలయంలో పల్లవి మ్యూజిక్, వెంకీ రిథమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల దివంగతులైన పల్లా వెంకటేష్ మాస్టర్ స్మారకార్థం నిర్వహించిన మధుర గీతాలతో పుష్పాంజలి ఘటించారు. పల్లా బాబ్జి, ఆడారి వెంకట్, భాగ్యలక్ష్మి, సివీ రాజేశ్వరి, సంజయ్ రామ స్వామి, పావని, ఎల్ వెంకటేష్, సుజాత కంఠ, నరసింగరావు, రంజిత, ప్రవీణ్ లు సినీ విషాద గీతాలు ఆలపించి నివాళి అర్పించారు. లక్ష్మీ స్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించిన కార్యక్రమంలో వివిధ కళా సంస్థల అధినేతలు చెన్నా తిరుమలరావు, భయ్యా శ్రీనివాస్, సన్ మూర్తి తదితరులు వెంకటేష్ మాస్టర్ సేవల్ని కొనియాడారు.



## వీళ్లు తగ్గారా.. వాళ్లు నెగ్గారా..!?

ఆమోదం పొందిన పాత మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా, డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్లను త్వరితగతిన అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాజ్యాంగంపై ప్రభుత్వం చేసిన దాడిని తాము అడ్డుకున్నామని రాహుల్ గాంధీ తర్వాత ప్రకటించారు. దేశ రాజకీయ చరిత్రలో పెను మార్పులు తీసుకువస్తుందని భావించిన మహిళా రిజర్వేషన్ బిల్లు (131వ రాజ్యాంగ సవరణ) పార్లమెంట్‌లో చతికిలపడింది. మూడు రోజుల పాటు సాగిన సుదీర్ఘ చర్చలు, ఉత్కంఠభరిత పరిణామాల మధ్య శుక్రవారం సాయంత్రం జరిగిన ఓటింగ్ ఫలితం మహిళా లోకానికి నిరాశనే మిగిల్చింది. నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపడి ఉన్న ఈ కీలక బిల్లుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ లభించకపోవడంతో ఇది ఆమోదం పొందలేకపోయింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించిన వివరాల ప్రకారం.. సభలో మొత్తం 528 ఓట్లు పోలయ్యాయి. రాజ్యాంగ సవరణ బిల్లు నెగ్గాలంటే కనీసం 352 ఓట్లు (2/3 వంతు) అనుకూలంగా రావాల్సి ఉండగా, కేవలం 298 ఓట్లు మాత్రమే మహిళా బిల్లుకు అనుకూలంగా పడ్డాయి. బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు నమోదయ్యాయి. అంటే, మ్యాజిక్ ఫిగర్‌కు మరో 54 ఓట్ల దూరంలో బిల్లు ఆగిపోయింది. తొలి రౌండ్‌లోనూ 489 ఓట్లు పోలవగా, అక్కడ కూడా 278 ఓట్లతో మెజారిటీని అందుకోలేకపోయింది. మహిళా బిల్లుపై చర్చ సందర్భంగా సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగింది. దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగాలంటే ఈ బిల్లుకు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. అయితే, ఈ బిల్లులోని నిబంధనలపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని బిల్లుతో లింక్ చేయడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నియోజకవర్గాల పునర్విభజన ఆవశ్యకతను గట్టిగా వినిపించారు. "ప్రస్తుతం ఒక ఎంపీ నియోజకవర్గంలో 60 వేల మంది ఓటర్లు ఉంటే, మరొక చోట 49 లక్షల మంది ఉన్నారు. ఇంత భారీ వ్యత్యాసం ఉన్నప్పుడు ఎంపీలు తమ ఓటర్లకు న్యాయం చేయడం అసాధ్యం" అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం కాలానుగుణంగా పునర్విభజనకు అవకాశం కల్పిస్తోందని, ప్రజల అంచనాలకు అనుగుణంగా ప్రాతినిధ్యం ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిని ఒక బూటకపు బిల్లుగా అభివర్ణిస్తూ, మహిళలకు అధికారం కల్పించడం కంటే ఎన్నికల మ్యాప్‌ను మార్చే రాజకీయ వ్యూహం దీని వెనుక ఉందని ఆరోపించారు. "2023లో బిల్లు తెచ్చినప్పుడే అమలుకు ఏళ్లు పడుతుందని చెప్పారు. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ప్రభుత్వం ఈ ఎత్తుగడ వేసింది" అని ఆయన విమర్శించారు. ప్రభుత్వం దీనిని మహిళా సాధికారతకు వేసిన పునాదిగా అభివర్ణిస్తుండగా, ప్రతిపక్షాలు మాత్రం దీనిని రాజకీయ లెక్కలతో కూడిన వ్యవస్థాగత మార్పుగా చూస్తున్నాయి. ఏది ఏమైనా, దశాబ్దాల కాలంగా నానుతున్న మహిళా రిజర్వేషన్ అంశం మరోసారి పార్లమెంటరీ గడప దాటలేకపోవడం 50 శాతం జనాభా ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

## లిక్కర్ స్కామ్‌లో వాసుదేవరెడ్డికి బెయిల్

(అమరావతి - జయజయహే)

మద్యం కుంభకోణం కేసులో ఏ2 నిందితుడు వాసుదేవ రెడ్డికి ఏసీబీ కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. 2, 4 సోమవారాల్లో విచారణ అధికారుల ఎదుట హాజరవ్వాలని, పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని, లక్ష చొప్పున ఇద్దరు పూచీకత్తులు ఇవ్వాలని ఆదేశించింది. ఇదే కేసులో మరో నిందితుడు ప్రణయ్ ప్రకాశ్ బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు డిస్మిస్ చేసింది. ఇదే కేసులో మరో ముగ్గురు నిందితులు ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్ రెడ్డిల రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ పూర్తి చేసింది. ఈ తీర్పును ఏప్రిల్ 24వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది.

## మే మొదటి వారంలో టెన్త్ ఫలితాలు

మొదటి పేజీ తరువాయి...

తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 3,415 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు మొత్తం 6,40,916 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో బాలురు 3,28,625 మంది, బాలికలు 3,12,264 మంది ఉన్నారు. సరాసరిన 99.05శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అయితే, ఫలితాల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 జిల్లాల్లో పదో తరగతి పరీక్షల ఎగ్జామ్స్ పేపర్స్ మూల్యాంకనం ప్రక్రియ ఈనెల 15వ తేదీతో ముగిసింది. ఎస్‌వోలు, సీఎస్‌లు, క్యాంపు ఆఫీసర్లు, ఉపాధ్యాయులు మూల్యాంకనాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. అయితే, మార్కులను మాన్యువల్‌తో పాటు ట్యాబ్‌లలోనూ నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మార్కుల లెక్కింపులో పొరపాటు లేకుండా ఉండేందుకు ఈ ఏడాది ట్యాబ్‌లను తీసుకొచ్చారు. మార్కులను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో నమోదు చేసి పొరబాట్లకు తావులేకుండా ఖచ్చితత్వం పాటించాలని ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం మూల్యాంకనం ప్రక్రియ పూర్తయింది. మార్కుల ప్రాసెసింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. అంతా సవ్యంగా జరిగితే.. మే మొదటి వారంలో పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడించేందుకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. గతేడాది ఏప్రిల్ 23వ తేదీన ఏపీ టెన్త్ ఫలితాలు విడుదలైన విషయం తెలిసిందే.

# వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు జయప్రదం చేయండి



**మాడుగుల ఏప్రిల్ 17 జయ జయహే**

మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల దేవరపల్లిలో ఈ నెల 19న నిర్వహించ తలపెట్టిన వ్యవసాయ కార్మిక సంఘం 14వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం కోరుతుంది ఈ మేరకు శుక్రవారం మండలంలో సత్యవరం ఉపాధి కూలీల వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ ఆఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా 14వ జిల్లా మహ సభలు ఈనెల 19 వ తేదిన ఆదివారం నాడు దేవరాపల్లి లో జరుగుతుందని దీనికి ప్రతి ఒక్కరు జయ ప్రదం చేయాలని కోరారు 1937నెల్లూరు జిల్లా అలగాను పాడు లో పుచ్చలపల్లి సందరయ్య స్తాపించిన సంఘం ఈరోజు దేశవ్యాప్తంగా శాఖోప శాఖలుగా వ్యాప్తి చేంది అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘంగా ఎర్పడిందని పేర్కొన్నారు. భూమి ఉపాధి తిండి బట్ట విద్య వైద్యం పేద ప్రజలు విముక్తి కోసం దేశంలో అనేక పోరాటాలు నిర్వహించటం జరింద న్నారు,అసైన్డ్ భూములు పేదలకు పంపిణీ చేయాలని పోడు పారెస్టు భూములకు పట్టాలు ఇవ్వాలని లింక్ రోడ్డు మంచి నీళ్లు సౌకర్యం కల్పించాలని గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అనేక సామాజిక సమస్యలపై సంఘం పోరాటాలు నడిపిన చరిత్ర ఉందన్నారు మూడు సంవత్సరాలకు ఓక్కసారి జరిగే ఈమహాసభలు గతమూడు సంవత్సరాలు జరిగిన పోరా అనుభవాలు భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన ఈమహాసభల్లో చేస్తామని తెలిపారు. దీనికి ముఖ్య అతిదులుగా సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె లోక నాదం రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యం,అప్పలరాజు రైతు సంఘం సీనియర్ నాయకులు గండి నాయని బాబు తో పాటు అనేకమంది సంఘం ముఖ్య జిల్లా నాయకులు హాజరు అవుతారని తెలిపారు ప్రతి ఓక్కరు మహసభలు జయప్రదానికి సహయ కారాలు ఇచ్చి అదిక సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు గిరిజన కూలీలు ధళితులు వ్రుత్తుదార్లు రైతులు హాజరు కావాలని పిలుపు నిచ్చారు.



## భారతీయ సంస్కృతికి ఆధార గ్రంథం
# శ్రీమద్రామాయణం

**డాక్టర్ మల్లు వేంకటరెడ్డి**
**కర్నూలు (జయ జయహే)**

భారతీయ సంస్కృతికి మూలాధారం శ్రీమద్రామాయణమేనని, ఇంతటి ఉన్నతమైన మానవీయ విలువలు కలిగిన శ్రీమద్రామాయణాన్ని విద్యార్థులకు బాల్యం నుండే నేర్పి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆస్పరి మండలం, ఐనకల్లు గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం ఈ సందర్భంగా జరిగిన ధార్మిక సభా కార్యక్రమంలో వారు ప్రసంగించారు. మూడురోజులు ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు కె. రామచంద్రాచారి, హార్మోనిష్టు యు. వీరేశ్, తబలిష్టు బి. ఉరుకుందు, యు. పవన్ కుమార్, గ్రామ పెద్దలు బోయ గోవిందు, కేశం వీరారెడ్డి, నాగన్న, వెంకటేశ్, రామాంజనేయులు, తలారి వీరసేను, వి.నాగన్న, తిక్కస్వామి, కె. రామచంద్ర, పవన్, యు. సుధాకర్, యు. రంగన్న, యు. కృష్ణమూర్తి, ఫోటో గ్రాఫర్ ఆదినారాయణ, టి. లాలప్ప, మల్లన్నతోపాటు భజన బృందం సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానంతరం భక్తులందరికీ మహాప్రసాదం అందించారు.




## టెక్కలి ప్రభుత్వ వైద్యునిపై
# విచారణకు ఆదేశాలు

**రెండేళ్లగా విధులకు గైర్హాజర్‌లో నున్న డాక్టరు**
**టెక్కలి ఏప్రిల్ 17 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని ప్రధాన కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు జి సురేష్ కుమార్ సివిల్ సర్జన్ రెండేళ్లగా తన విధులకు అనధికారకంగా హాజరు కాకపోవడంతో రోగుల సేవలు అటునుంచి గైర్హాజరకు తగిన కారణాలను పది రోజుల్లో సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రులో 2023 విధుల్లో చేరిన ఈయన 2025 వరకు రెండేళ్ల పాటు విధులకు దూరంగా ఉన్నారు, గైర్హాజరపై తక్షణమే ప్రభుత్వానికి పది రోజుల్లో వివరణ సమర్పించాలని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్ గౌర్ ఆదేశాలు జారీ చేశారు , ప్రభుత్వ ఆసుపత్రులలో దీర్ఘకాలిక గార్హాజర్ కావడం వల్ల రోగులకు ఆరోగ్య సేవలు ఎలా అందుతాయని ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుందని పలువురు అంటున్నారు.



## దివ్యాంగులకు వీల్ చైర్‌లు పంపిణీ చేసిన
# కలెక్టర్ నిషాంతి

**అరకులోయ జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ ప్రాంగణం వద్ద జిల్లా వికలాంగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులకు సహయ ఉపకరణాల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ టీ నిషాంతి ముఖ్య అతిథిగా హాజరై తన చేతులు మీదుగా వీల్ చైర్ లు- 3 వినికిడి పరికరం బి1 పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో బాగంగా నే జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, ఐటిడిఏ పిఓ ఆదిత్య వర్మ , డిస్ట్రిక్ట్ డిజైరబుల్ వెల్ఫేర్ కవిత పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ఏ సమస్య వచ్చినా తనకు సంప్రదించాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఆర్వో అప్పల నాయుడు, జిల్లా వికలాంగుల చైర్మన్ జన్ని రవి కుమార్, ప్రధాన కార్యదర్శి పెట్టేలి కొండ బాబు,విఎస్ పిఎస్ అధ్యక్షుడలు చరణ్, తదితరులు పాల్గొన్నారు.



# నేడు సీఎం చంద్రబాబు పర్యటన

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**
**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 18న తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా నిడదవోలుకు రానుండటంతో స్థానికంగా ఆసక్తి నెలకొంది.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న “స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర” కార్యక్రమంలో భాగంగా ఈ పర్యటన జరగనుంది. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి దోహదపడే పలు కీలక ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.రాష్ట్రంలోని 58 మున్సిపాలిటీల పరిధిలో 1085 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 148 ఎస్‌టీపీ ప్లాంట్లకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. నిడదవోలులో భాగంగా రూ.4.5 కోట్ల వ్యయంతో మాలకోడు చెరువు సుందరీకరణ పనులు చేపట్టనుండగా, మరో రూ.13.5 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు.పట్టణంలో వర్షపు నీరు నిల్వ కాకుండా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థపై కూడా ముఖ్యమంత్రి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మరియు ఇతర ఉన్నతాధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. హెలిప్యాడ్ నుంచి ప్రజా వేదిక వరకు ప్రతి అంశాన్ని మంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా నిడదవోలుకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.రేపు ఉదయం జరగనున్న ఈ బహిరంగ సభ ద్వారా నిడదవోలు అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# మే నెలలో విశాఖలో జేసిఐ వైభవం

**విశాఖపట్నం (జయజయహే)**

విశాఖ ఋషికొండ లో ప్రైవేటు హోటల్ లో మే 17న జేసిఐ ధక్షిణ భారత దేశం వైస్ ప్రెసిడెంట్ బొత్స దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరగనుంది. ఆ యొక్క గోడ పత్రికను బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ మరియు గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమ నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు సునీత దిలీప్ కేఎన్ఆర్ కి ఆహ్వానం పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జేసిఐ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖలో జరగనున్న కార్యక్రమంలో రెండు వందల మందికి జేసిఐ ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో బిజేపి రాష్ట్ర ఎస్సి మోర్చా నాయకురాలు కట్టా పద్మ, జిల్లా అధ్యక్షులు ములకలపల్లి ప్రకాష్,సింగంపల్లి శ్రీనివాసరావు, మేఘన,మధు,వీరబద్రుడు, రాపర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# కొండ కాపు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయవద్దని వినతి పత్రం అందజేత

**డుంబ్రిగూడ: జయ జయహే.**

కొండకాపు ఎస్టీ కులధృవీకరణ పత్రం విషయమై కోర్టులో స్టే ఉండగా మధ్యంతర కోర్టు ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిచిన ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి సురేష్ కుమార్. ఆదివాసీ సంఘాల నాయకులు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ డుంబ్రిగూడ మండలం కురిడి పంచాయతీ కురిడి గ్రామానికి చెందిన పల్లేడి. రాజు కుమార్తె పల్లేడి. సాహితీ చదువు నిమిత్తం తాత్కాలిక కొండకాపు ఎస్టీ కులధృవీకరణ పత్రం జారీ చేయాలనీ హైకోర్టు ఆర్డర్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆదివాసీ సంఘాల నాయకులు ప్రజలు.ఈ విషయమై డుంబ్రిగూడ తహశీల్దారు త్రీవేణి కు కలిసి కొండకాపు ఎస్టీ కుల ధృవీకరణ పత్రం జారీ చేయవద్దని వినతిపత్రం అందజేశారు. భారత రాజ్యాంగంలోని ఆదివాసీలకు గిరిజన ప్రాంతంలో సర్వ హక్కులు కల్పించబడ్డాయనీ, 1997 సమత జడ్జిమెంట్ ప్రకారం ఐదవ షెడ్యూల్ భుభాగంలో నిజమైన ఆదివాసీ లకు తప్ప మరో ఏ ఒక్కరికి హక్కులు లేదని ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అధికారులు గౌరవించాలనీ చెప్పారు. 1993చట్టంలోని సెక్షన్ 7ప్రకారం అప్పీలేట్ అథారిటీ అయినా రాష్ట్ర ప్రభుత్వం కుల ధృవీకరణ పత్రాల రద్దు ఉత్తర్వులు పై స్టే విధించిన వాస్తవాన్ని అధికారులు పరిగణనలోనికి తీసుకోవాలని చెప్పారు. ఇలాంటి సున్నిత మైన విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఇతర కులానికి ఆదివాసీ సమాజం మధ్య తగదాలు,సమస్యతకమైనా వాతావరణం కు దారి తీసేలా ప్రవర్తించవద్దనీ చెప్పారు.ఈ విషయం పై ఆదివాసీ సంఘాలు కలిసి హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేయడానికి కూడా సిద్దంగా ఉన్నామని ఈ సందర్బంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాంగి పరశురామ్, పాంగి సత్యనారాయణ, రవి, పెనుమాల అనిల్, గుజ్జెల గణేష్, పాంగి మోహన్ దాస్,కొర్రా జగన్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ శాంతామణి దేవి అమ్మవారిని దర్శించుకున్న స్పీకర్ అయ్యన్న

**అరకులోయ: జయ జయహే.**

అరకులోయ మండలం లోని యండపల్లివలస గ్రామంలో వెలసిన శ్రీ శాంతామణి దేవి అమ్మ వారిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింత కాయల అయ్యన్న పాత్రుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శాంతమ్మ అమ్మ వారిని అయ్యన్నపాత్రుడు తమ ఇంట ఇలవేల్పుగా భావిస్తూ ఉంటారు. రెండేళ్లకు ఒకసారి జరిగే అమ్మవారి జాతర సందర్భంగా కుటుంబ సమేతంగా హాజరై పూజలు నిర్వహించడం స్పీకర్ కుటుంబానికి ఆనవాయితీ. ఆ సాంప్రదాయంలో భాగంగానే ఈ ఏడాది కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కాఫీ మ్యూజియం ను స్పీకర్ సందర్శించారు . అక్కడ నుండి డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్ రిసార్ట్స్ ను సందర్శించి తిరిగి అరకులోయ కు చేరుకున్నారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో తిరిగి రోడ్డు మార్గాన విశాఖ కు పయనమయ్యారు. కాగా అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనడానికి స్పీకర్ గురువారం రాత్రి అరకులోయ కు చేరుకున్నారు. అరకులోయకు చేరుకున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు కు ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ డా. సియ్యారి దొన్ను దొర టిడిపి శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు .

For a pure tomorrow.. జయహో

### భగవంతునికి నివేదించే వివిధ ఫలాల

# నైవేద్యం ఫలితాలు

**పుట్టా శ్రీనివాసరావు**

నిత్యం మన హైందవ ధర్మంలో ప్రతి ఇంట భగవంతుని పూజించుకోవడం అనాధగా వస్తున్న ఆచారం. ఆ పూజలో వివిధ రకాల నైవేద్యాలను సమర్పిస్తాం. అయితే ఎలాంటి నైవేద్యం సమర్పిస్తే ఎలాంటి ఫలితం చేకూరుతాదో ఒకసారి తెలుసుకుందాం.

కొబ్బరి కాయ ( పూర్ణ ఫలం ) – భగవంతుడికి కొబ్బరి కాయను నైవేద్యం గా సమర్పిస్తే మొదలు పెట్టిన పనులన్నీ త్వరితగతిన సులభంగా విజయవంతం అవుతాయి. భగవంతుడికి అరటిపండు నైవేద్యం గా సమర్పిస్తే సకల కార్యసిద్ధి జరుగుతుంది.



అరటిపండు గుజ్జుగా చేసి నైవేద్యం గా సమర్పిస్తే అప్పుల బాధనుండి విముక్తి పొందుతారు. చేజారిన సొమ్ము తిరిగి సకాలంలో చేతికి అందుతుంది. చిన్న అరటిపళ్లు నైవేద్యం గా సమర్పిస్తే మద్యలో నిలిచిపోయిన పనులు సక్రమంగా పూర్తి అవుతాయి. ఇక శనీశ్వరునికి నేరెడు పండు నైవేద్యం గా పెట్టి ఆ ప్రసాదాన్ని తింటే వెన్నునొప్పి, నడుమునొప్పి, మోకాళ్ల నొప్పి వంటివి తొలిగిపోయి ఆరొగ్య వంతులు అవుతారు.

భగవంతుడికి నివేదించిన ద్రాక్ష పండ్లు ముందు చిన్నపిల్లలకు, తరవాత పెద్దలకు పంచినట్టైతే ఎల్లవేళలా సుఖసంతోషాలతో వర్దిల్లుతారు. రోగాలు నశిస్తాయి. కార్యజయం లభిస్తుంది. మామిడి పండుని నైవేద్యం గా సమర్పిస్తే ప్రభుత్వం నుంచి రావలసిన నగదు ఎలాంటి అడ్డంకులు లేకుండా సకాలంలో అందుతుంది. నమ్మి మోసపోయినప్పుడు నైవేద్యం గా పెట్టిన మామిడి పండుని దేవునికి అభిషేకం చేసిన తేనెలో కలిపి నైవేద్యం గా పెట్టి అందరికి పంచి తరువాత తిన్నట్లయితే మోసం చేసిన వారు స్వయంగా మీ నగదును మీకు తిరిగి ఇచ్చేస్తారు.

అంజూర పండు. – భగవంతుడికి నైవేద్యం పెట్టిన అన్జురాపండు ను అందరికి పంచిన తరువాత తిన్నవారికి ఆనారోగ్య భాధలు అన్ని తొలగి ఆరొగ్య వంతులు అవుతారు. అలాగే అలాగే సపోట పండు నైవేద్యం గా సమర్పిస్తే పెళ్లి నిశ్చయ సంభంద విషయాలలో అవాంతరాలు అన్ని తొలగిపోతాయి. భగవంతుడికి యపిల్ పండు ని నైవేద్యంగా పెడితే దారిద్ర్యం తొలగి ధనవంతులు అవుతారు. భగవంతుడికి కమలా పండు నివేదించి నట్లయితే నిలిచిపోయన పనులు సజావుగా పూర్తి అవుతాయి. పనసపండు ని దేవుడికి నైవేద్యంగా పెడితే శత్రు నాశనము, రోగావిముక్తి కలిగి సుఖంగా ఉంటారు. ఈ విధంగా భగవంతునికి నైవేద్యాలు సమర్థిస్తూ సకల సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రముఖ ఆస్ట్రాలజర్.

# అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్

## విద్య, ఎంప్లాయ్‌మెంట్, టెక్నాలజీ విప్లవం

**(సి.హెచ్.ప్రతాప్)**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తూర్పు కృష్ణా జిల్లా అమరావతి వేదికగా రూపుదిద్దుకుంటున్న 'అమరావతి క్వాంటం వ్యాలీ' ప్రాజెక్ట్ ఒక చారిత్రాత్మక ఘట్టం. భారతదేశంలోనే మొట్టమొదటి క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ గా గుర్తింపు పొందనున్న ఈ ప్రాజెక్ట్, ప్రపంచ క్వాంటం టెక్నాలజీ మ్యాపులో తెలుగు రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టనుంది. అమరావతి రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో ఈ క్వాంటం కంప్యూటింగ్ సెంటర్, టెక్ పార్క్ మరియు రీసెర్చ్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ ల క్వాంటం కంప్యూటర్ (సిస్టమ్-2) ను నెలకొల్పడం. దీని కోసం ఐబిఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి గ్లోబల్ సంస్థలు టెక్-పార్ట్నర్లుగా సహకరిస్తున్నాయి. ఈ కేంద్రం ద్వారా భారతీయ కంపెనీలు, పరిశోధకులు మరియు స్టార్టప్ లు క్వాంటం కంప్యూటింగ్ రిసోర్సెస్ ను రిమోట్ పద్ధతిలో ఉ పయోగించుకునే అద్భుత అవకాశం కలుగుతుంది.**




ఈ ప్రాజెక్ట్ వల్ల రాష్ట్రానికి చేకూరే ప్రయోజనాలు అపారం, ముఖ్యంగా ఎంప్లాయ్‌మెంట్ కల్పనలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. క్వాంటం వ్యాలీ ద్వారా వచ్చే టెక్ హబ్, స్టార్టప్ ఇన్క్యుబేషన్ మరియు వివిధ కోర్సుల ద్వారా దాదాపు ఒక లక్ష ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. యువతకు క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్రిప్టోగ్రఫీ వంటి అడ్వాన్స్‌డ్ సబ్జెక్టులలో ట్రైనింగ్ ఇచ్చి, వారిని గ్లోబల్ టెక్ కంపెనీలలో స్పెషలిస్ట్ జాబ్స్ కోసం సిద్ధం చేస్తారు. పరిశోధన మరియు ఇండస్ట్రీ రంగానికి కూడా ఇది పెద్ద బూస్ట్ ఇస్తుంది. క్వాంటం కంప్యూటర్లు సాధారణ కంప్యూటర్ల కంటే వేల రెట్లు వేగంగా కంప్యూటేషన్ చేస్తాయి. దీని వల్ల ఫార్మా, ఎగ్రో-కెమికల్స్, మెటీరియల్ సైన్స్ మరియు క్లైమేట్ మాడలింగ్ లో పరిశోధనలు వేగంగా, తక్కువ ఖర్చుతో సాధ్యమవుతాయి. ఏపీలోని బయోటెక్ మరియు అగ్రికల్చర్ వంటి కీలక రంగాలకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

సైబర్ సెక్యూరిటీ మరియు డిజిటల్ ఇండియా లక్ష్య సాధనలో క్వాంటం టెక్నాలజీ కీలక మలుపు కానుంది. 'క్వాంటం క్రిప్టోగ్రఫీ' ద్వారా బ్యాంకింగ్, గవర్నమెంట్ ట్రాన్సాక్షన్స్ మరియు డిజిటల్ ఐడెంటిటీలు మరింత




సురక్షితంగా మారుతాయి. భవిష్యత్తులో పాత ఎన్‌క్రిప్షన్ సిస్టమ్లను డీకోడ్ చేసే ప్రమాదం ఉన్నందున, కొత్త క్వాంటం-సెక్యూర్ మోడల్స్ అమలు కావాలి. అమరావతి ఇటువంటి డిఫెన్స్ టెక్నాలజీలకు ప్రయోగశాలగా మారుతుంది. అలాగే, ఇక్కడ ఏర్పాటు చేసే ఇన్క్యుబేషన్ సెంటర్ల ద్వారా లోకల్ సాఫ్ట్‌వేర్ మరియు హార్డ్‌వేర్ స్టార్టప్ లకు ఫండింగ్, మెంటర్‌షిప్ మరియు ఇన్ఫ్రాస్ట్రక్చర్ దొరుకుతుంది. ఇది తెలుగు నేలపై సరికొత్త హెల్త్ టెక్ మరియు క్లైమేట్ టెక్ స్టార్టప్ లు పుట్టే వాతావరణాన్ని నిర్మిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా అమెరికా, చైనా, యూరోపియన్ యూనియన్, జపాన్ వంటి దేశాలు క్వాంటం రీసెర్చ్ పై బిలియన్ల డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్ చేస్తున్నాయి. ఉదాహరణకు, అమెరికా తన నేషనల్ క్వాంటం ఇనిషియేటివ్ కింద అనేక క్వాంటం ల్యాబ్ లను ప్రోత్సహిస్తోంది. ఈ పోటీ ప్రపంచంలో అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ స్థాయిలో తన ఉనికిని చాటుకోనుంది. కేవలం ఐటీ రంగమే కాకుండా, విద్య మరియు పారిశ్రామిక రంగాలలో ఇది ఒక నూతన విప్లవానికి నాంది పలుకుతుంది. భవిష్యత్ తరాలకు అత్యాధునిక సాంకేతికతను అందిస్తూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో ఈ ప్రాజెక్ట్ ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఇది కేవలం ఒక టెక్నాలజీ ప్రాజెక్ట్ మాత్రమే కాదు, ఏపీ యువత కలలకు మరియు గ్లోబల్ టెక్నాలజీకి మధ్య వారధి.

# ర్యాగింగ్ భూతం ఇంకా ఎన్నాళ్లు ?

**(సి.హెచ్.ప్రతాప్)**

**హైదరాబాద్‌లోని ఒస్మానియా మెడికల్ కాలేజీ ఆవరణలో మొదటి సంవత్సరం పీజీ విద్యార్థి డాక్టర్ కె. సురేష్ ఆత్మహత్య చేసుకోవడం వైద్య విద్యా రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. జనరల్ సర్జరీ విభాగంలో ఎంఎస్ చదువుతున్న ఇరవై ఆరు ఏళ్ల యువ వైద్యుడు నిద్రమాత్రలు, ఇంజెక్షన్ల ద్వారా ప్రాణాలు తీసుకోవడం కేవలం ఒక వ్యక్తిగత విషాదం మాత్రమే కాదు, అది వ్యవస్థాగత వైఫల్యాలకు నిదర్శనం. ఉన్నత చదువులు చదివి సమాజానికి సేవ చేయాల్సిన ఒక మేధావి ఇటువంటి కఠిన నిర్ణయం తీసుకోవడం వెనుక ఉన్న కారణాలను లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఈ సంఘటనను పరిశీలిస్తే, విద్యార్థి కుటుంబ సభ్యులు సీనియర్ల వేధింపులు, ర్యాగింగ్ ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు.**



వైద్య కళాశాలల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న 'సీనియరిటీ సంస్కృతి' అనేక సందర్భాల్లో వికృతంగా మారుతోంది. పని ఒత్తిడి పేరుతో జూనియర్లపై అదనపు భారాన్ని మోపడం, మానసికంగా వేధించడం వంటివి విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. సీసీటీవీ దృశ్యాలు, సామాజిక మాధ్యమాల సంభాషణల ద్వారా పోలీసులు విచారణ జరుపుతున్నప్పటికీ, ప్రాథమికంగా అందుతున్న సమాచారం ప్రకారం విద్యాసంస్థల్లో భయానక వాతావరణం నెలకొందని స్పష్టమవుతోంది. గతంలో నిమ్స్, విజయవాడ వంటి చోట్ల జరిగిన సంఘటనలు కూడా ఇలాంటి వేధింపుల పర్యవసానమే. పీజీ విద్యార్థులు గంటల తరబడి విశ్రాంతి లేకుండా పనిచేయడం, పైస్థాయి అధికారుల నుండి వచ్చే ఒత్తిడి వారిని నిరాశలోకి నెడుతున్నాయి.

వైద్య విద్యా సంస్థల్లో ఇటువంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి కఠినమైన చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు కేవలం పేరుకే పరిమితం కాకుండా నిరంతరం పర్యవేక్షణ జరపాలి మరియు వేధింపులకు గురయ్యే విద్యార్థులు నిర్భయంగా ఫిర్యాదు చేసేలా రహస్య ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేయాలి. దీనితో పాటు ప్రతి మెడికల్ కాలేజీలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మానసిక నిపుణులను అందుబాటులో ఉంచడం, వారు తమ ఒత్తిడిని పంచుకోవడానికి నిరంతర కౌన్సిలింగ్ కేంద్రాలను నిర్వహించడం, ఇరవై నాలుగు గంటల హెల్ప్ లైన్ సేవలు సమర్థవంతంగా పనిచేసేలా చూడటం అత్యవసరం. పీజీ విద్యార్థులపై ఉండే పనిభారాన్ని తగ్గించడానికి శాస్త్రీయమైన పనివేళలను అమలు చేస్తూ వారికి తగినంత విశ్రాంతి లభించేలా చూడాలి. సీనియర్లు మరియు జూనియర్ల మధ్య వేధింపుల సంస్కృతికి బదులుగా స్నేహపూర్వకమైన మెంటర్‌షిప్ విధానాన్ని తీసుకురావాలి, తద్వారా అధ్యాపకులు విద్యార్థుల ప్రవర్తనను మరియు వారి మానసిక స్థితిని గమనిస్తూ తగిన మార్గనిర్దేశం చేయగలరు. వేధింపులకు పాల్పడే వారు ఎంతటి వారైనా సరే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం ఇతర విద్యార్థులకు బలమైన హెచ్చరికగా ఉంటుంది.

వైద్య విద్య అనేది ప్రాణాలను కాపాడే విద్య. అటువంటి పవిత్రమైన వృత్తిలోకి అడుగుపెట్టే విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మరియు విద్యా సంస్థలపై ఉంది. డాక్టర్ సురేష్ మరణం ఒక హెచ్చరిక కావాలి. భయం, మౌనం రాజ్యమేలే చోట జ్ఞానం వర్ధిల్లదు. కాబట్టి, విద్యార్థులు తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకునే, తోటివారిని గౌరవించే ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని నిర్మించడమే మనం ఆ మృతుడికి ఇచ్చే అసలైన నివాళి. ఆ సర్జన్ కలలు హాస్టల్ గదిలో ఆవిరి కావడం సమాజానికే తీరని లోటు. చదువు మనిషికి జీవించడం నేర్పాలి కానీ, జీవాన్ని తీసుకోవడం కాదు.




### అభివృద్ధి నిలిచిపోయింది...

# మహిళల పట్ల నిర్లక్ష్యం

**మాజీ ఎంపీ మార్గాని భరత్ విమర్శలు**

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు మందగించాయని, మహిళా సంక్షేమాన్ని ప్రస్తుత ప్రభుత్వం విస్మరించిందని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ఆరోపించారు. శుక్రవారం మార్గాని ఎస్టేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల సాధికారతకు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ రుణాలు వంటి పథకాల ద్వారా కోట్లాది రూపాయలు మహిళల ఖాతాల్లో నేరుగా జమయ్యాయని తెలిపారు. ఇళ్ల పట్టాల పంపిణీతో పాటు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మహిళలకు గౌరవస్థానం కల్పించామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని భరత్ విమర్శించారు. “తల్లికి వందనం” పథకంలో కోతలు విధించడం, లబ్ధిదారులను నిరాశపరచడమేనని అన్నారు. గతంలో మంజూరైన ఇళ్ల పట్టాలను కూడా ప్రజలకు అందకుండా అడ్డుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. రాజమహేంద్రవరం అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఆయన ఆరోపించారు. గతంలో తాము సాధించిన ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం తమ విజయాలుగా చూపించుకుంటోందని విమర్శించారు. దివాన్ చెరువు, మోరంపూడి ఫ్లైఓవర్‌లకు సంబంధించి మౌలిక సదుపాయాల లోపాలను ప్రస్తావించారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి, ఎయిర్‌పోర్ట్ విస్తరణకు తానే నిధులు తీసుకువచ్చినా, వాటి అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని అన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఇసుక, మద్యం అక్రమాలు పెరిగాయని ఆరోపించారు. ఇక నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ఈనెల 18న మార్గాని ఎస్టేట్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 'మార్గాని భరత్ జాబ్ సెంటర్' ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పలు ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయని, యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన కూటమి నాయకులు

**చోడవరం,ఏప్రిల్ 17 జయ జయహే**

చోడవరం నియోజవర్గ పరిధిలో గల కొన్నెంపూడి గ్రామంలో గల ప్రతిష్టాత్మకమైన కేంద్రం ప్రభుత్వ సంస్థ అయిన కృషి విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం జనసేన పార్టీ ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు,రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ చోడవరం బిజెపి ఇంచార్జ్ ఈర్లే శ్రీరామమూర్తి, చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవి రామ అప్పారావు పలువురు కూటమి నాయకులు రైతులతో కలిసి సందర్శించారు. 20 మండలాల్లో గల రైతులకు ఎన్నో సేవలందిస్తున్న ఈ కృషి విజ్ఞాన కేంద్రం ప్రస్తుతం పలు సమస్యలను ఎదుర్కొంటున్న క్రమంలో ఈరోజు క్షేత్రస్థాయి పర్యటన చేసిన కూటమి నాయకులు అక్కడున్న పరిస్థితులను డైరెక్టర్ రాజకుమార్ ద్వారా తెలుసుకోవడం జరిగింది .అలాగే ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు రైతులు స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడటం జరిగింది.ఈ సందర్భంగా జనసేన ఇంచార్జి రాజు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం అనేది మన ప్రాంతానికి ఎంతో అత్యంత ప్రతిష్టాత్మమైన సంస్థని అలాగే కేవలం వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఉన్న చోడవరం నియోజవర్గంలో రైతుల ప్రయోజనాలను కాపాడ్డానికి ఆర్థికంగా వారిని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడానికి ఈ కేంద్ర సేవలు అత్యవసరం అని ఈ క్రమంలో రాబోయే కొద్ది రోజుల్లోనే పలు కార్యక్రమాలను రూపొందించి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు.ఈ సంస్థకు అత్యవసరంగా కావలసిన ఒక కిలోమీటర్ రోడ్డును, చెక్ డాం ను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి తీసుకెళ్లి పంచాయతీరాజ్ శాఖ ద్వారా సాంక్షన్ చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. యువతకు వ్యవసాయం గూర్చి అవగాహన,ఆసక్తి కలిగించడానికి త్వరలోనే జెన్ జి కొరకు వ్యవసాయం గూర్చి ప్రత్యేక కార్యక్రమం చేస్తామని అన్నారు.రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ ఒక వ్యవసాయ దారుడిగా తనకు వ్యవసాయంపై సంపూర్ణ




అవగాహన ఉందని మన ప్రాంతంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఈ కేంద్ర నుంచి అన్ని రకాల సేవలను తీసుకుని వ్యవసాయాన్ని లాభ తరంగా చేయడానికి గట్టిగా కృషి చేస్తామని , అలాగే ఇక్కడ ఉన్న పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తారని అన్నారు.చోడవరం బిజెపి ఇంచార్జ్ ఈర్లే శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఈ కేంద్రం ఉన్న గ్రామం తనకు స్వగ్రామం లాంటిదని ,దశాబ్దాల నుండి ఇక్కడ ఉన్న రైతులపై సంపూర్ణ అవగాహన వ్యక్తిగా ఈ కేంద్రం స్థాపన తర్వాత ఎన్నో సేవలు అందిస్తూ వస్తున్న ఇక్కడ సిబ్బందిని అభినందిస్తున్నానని , అయితే ఇంకా మెరుగైయిన సేవలు అందించవలసిన అవసరం ఉందని, ఆ క్రమంలో ఈ కేంద్రం కు కావలసిన ఎటువంటి సౌకర్యాలు అయిన స్థానిక ఎంపీ సీఎం రమేష్ దృష్టికి తీసుకువెళ్లి అనుమతులు వచ్చేటట్టుగా ప్రయత్నిస్తామని చెప్పారు. అందరం రాజకీయాలకతీతంగా కలిసి పనిచేసే రైతుల ప్రయోజనాలు కాపాడదామని అన్నారు. అలాగే ఉత్తమ రైతుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు తీసుకున్న దొంకన అప్పలనాయుడు మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అనేది మాటల్లో కాకుండా చేతల్లో ప్రజాప్రతినిదులు చూపించాలని, రైతులేని సమాజాన్ని ఊహించలేమని కృషి విజ్ఞాన్ కేంద్రం సేవలు గొప్పవని అన్నారు.చోడవరం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అల్లం రామ అప్పారావు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ ద్వారా కృషి విజ్ఞాన కేంద్రం సేవలను గ్రామాల్లోకి తీసుకువెళ్లి రైతులకు అన్ని రకాలుగా తోడ్పాటును అందిస్తామని అన్నారు.ఈ సమావేశం లో ఉత్తమ సైంటిస్ట్ గా రాష్ట్ర ప్రభుత్వ అవార్డు పొందిన శ్రీ రాజ్ కుమార్ ని, ఉత్తమ రైతు గా రాష్ట్ర ప్రభుత్వ అవార్డు పొందిన దొంకన అప్పల నాయుడు ని ఘనం గా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చోడవరం మహిళా అధ్యక్షురాలు నందవరపు రమాదేవి నాయుడు , బుచ్చయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు డిఎస్ నాయుడు, రావికమతం మండల పార్టీ అధ్యక్షులు మైచర్ల నాయుడు నియోజకవర్గ జనసేన పార్టీ ప్రోగ్రాం కన్వీనర్ గుండు గణేష్, బిజెపి ముఖ్య నాయకులు పడ్డాది మాజీ ఉపసర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరావు, వడ్డాది పిఏసిఎస్ చైర్మన్ దొండా నరేష్ చిన్న వదిన మాజీ సర్పంచ్ గోవిందరావు వడ్డాది కస్పా కాలువ చైర్మన్ దాడి గోవింద్ మాజీ సర్పంచ్ ఆది సత్యనారాయణ పలువురు రైతులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




# 300ఏం బస్సులతో విస్తుపోతున్న గ్రామీణం

**వైజాగ్..మాడుగుల పల్లెవెలుగులు వేయండి**

**మాడుగుల ఏప్రిల్ 17 జయ జయహే**

మాడుగుల వైజాగ్ రూట్ లో పల్లె వెలుగు బస్సులు నిర్వహించాలని మాడుగుల గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గత కొన్నాళ్లుగా నిర్వహిస్తున్న 300 ఏం బస్సులు అందుబాటులో ఉండటం లేదని గ్రామీణ స్టేజిలో ఆపడం లేదని మరి వైజాగ్ ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. బస్సు సిబ్బందిని అడిగితే స్టాప్ లేదంటున్నారని మరి ఏం చేయాలని ప్రశ్నిస్తున్నారు. మాడుగుల లో కూడా బస్సులు ఇలా వచ్చి అలా వెళ్ళిపోతున్నాయని ఇక ఎం కోటపాడు, ఎంకే వల్లాపురం,కేజే పురం, ముకుందపురం వంటి గ్రామాల వద్ద ఈ బస్సులు ఆపడం లేదని వారు మండిపడుతున్నారు. గతంలో ఈ పరిస్థితి లేదని గత ఆరు మాసాల నుంచే ఈ పరిస్థితి ఎదురయిందని చెబుతున్నారు. అలాంటప్పుడు ప్రజలకు ఉపయోగశీ లేని 300 ఏం బస్సులను నిలుపు చేసి వాటి స్థానంలో పల్లె వెలుగు బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వాటి వల్ల ధర కూడా తగ్గుతుందని ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు ఈ విషయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తగు చొరవ చూపాలని కోరుతున్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితునికి పదేళ్లు కారగార శిక్ష

**లక్ష జరిమానా**


**తీర్పునిచ్చిన చోడవరం జిల్లా కోర్టు**

**చోడవరం ఏప్రిల్ 17 జయ జయహే**

గంజాయి అక్రమ రవాణా కేసులో(ఎన్డిపిఎస్) నిందితునికి పదేళ్లు కఠిన కార్యవర్గ శిక్షతోపాటు లక్ష రూపాయలు జరిమాన విధిస్తూ శుక్రవారం చోడవరం అదనపు జిల్లా సెషన్ కోర్టు తీర్పునిచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు అల్లూరు జిల్లా పోలీసు అధికారి అమిత్ బర్దర్ వెల్లడించారు. అల్లూరి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో, హుకుంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎన్డీపీఎస్ కేసు లో న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించిందన్నారు. 2015లో ఈ కేసు నమోదు అయిందిఈ కేసును 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి హరి నారాయణ విచారించి, నిందితుడు మెరుగుమల్ల విజయసాయి పై నేరం రుజువైనట్లు నిర్ధారించి, ఎన్ డి పి ఎస్ చట్టం సెక్షన్ 20(బి)(ఐఐ)(సి) ఆర్/డబ్ల్యు 8(సి) ప్రకారం పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,00,000/- జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 2 ఏళ్ల కారాగార శిక్ష విధించబడుతుందని తీర్పు నిచ్చారు.కేసు వివరాలు పరిశీలిస్తే2015 సెప్టెంబర్ 15 ఉదయం 7 గంటలకు, నిందితుడు ఒక ఈచర్ వాహనంలో ( ఏపీ 37 వై 1801) అక్రమంగా 462 కిలోల గంజాయి రవాణా చేస్తుండగా, హుకుంపేట ఎస్సెచ్ఓ బృందం బుర్మంగూడ జంక్షన్ వద్ద పట్టుకుంది. వెంటనే వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.కోర్టు ఆదేశాల మేరకు నిందుతుడు పై విచారణ 2025 నవంబర్ 6 నుండి 2026 ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగింది.విచారణ అనంతరంమెరుగుమల్ల విజయసాయి దోషిగా తేలడంతో శిక్ష విధించారు.ఈ కేసులో ప్రభుత్వ తరఫున సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సందర్భంగాజిల్లా పోలీసు అధికారి అమిత్ బర్దార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసులో నిందుతుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన హుకుంపేట ఎస్ హెచ్ ఓ, సి ఎం ఎస్ ఇన్స్పెక్టర్ డి నవీన్ కుమార్ ని, సిఎంఎస్ కోర్టు సిబ్బందికి సిబ్బందికి అభినందనలు తెలుపారు.

# హజ్‌కు బయలుదేరుతున్న రాష్ట్ర యాత్రికులు





**పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

**ఏర్పాట్లను పరిశీలించిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**అమరావతి, ఏప్రిల్17 (జయ జయహే )**

విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి ఈనెల 18, 19 తేదీల్లో రెండు దఫాలుగా ఆంధ్రప్రదేశ్ హజ్ ప్రయాణికులు మక్కా యాత్రకు బయలుదేరనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి హజ్ యాత్రకు బయలుదేరుతున్న యాత్రికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడం జరిగింది. ఒకరోజు ముందుగానే విజయవాడకు చేరుకునే యాత్రికులందరికీ పురుషులు, మహిళలకు వేరువేరుగా వసతి ఏర్పాట్లు, భోజన సౌకర్యం తదితర ఏర్పాట్లను మైనారిటీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో హజ్ కమిటీ పూర్తి చేసింది. శుక్రవారం విమానాశ్రయం వద్ద ఎస్ఎం కన్వెన్షన్ లో ఏర్పాటుచేసిన విడిది ఏర్పాట్లను న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పరిశీలించారు. మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాషా, సీఈఓ గౌస్ పీర్ లు హజ్ యాత్రికులకు ప్రభుత్వం తరఫున ఏర్పాటుచేసిన వసతులు, ఇతర మౌళిక సదుపాయాల గురించి మంత్రి ఫరూక్ కు వివరించారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఏపీ నుంచి ప్రస్తుత ఏడాది 2000 మంది యాత్రికులు హజ్ కు బయలుదేరుతున్నారని పేర్కొన్నారు. గన్నవరం నుంచి ఈనెల 18వ తేదీన మొదటి దశలో 156 మంది, 19వ తేదీన రెండవ దశలో 177 మంది హజ్ కు బయలుదేరుతున్నారని తెలిపారు. మిగిలినవారు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాల నుంచి హజ్ కు బయలుదేరుతారని అన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ కి వెళ్లి వచ్చే వారందరికీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. గన్నవరం నుంచి బయలుదేరుతున్న వారందరికీ పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వసతి, భోజన సౌకర్యం, పురుషులు, మహిళలకు వేరువేరుగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మైనారిటీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో హజ్ కమిటీ యాత్రికులందరికీ అన్ని ఏర్పాట్లును పూర్తి చేయడం జరిగిందని మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఇక్కడే ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రార్థనాలయంలో జుమ్మా నమాజులో మంత్రి పాల్గొని ఆ తరువాత యాత్రికులతో కలిసి భోంచేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూఖ్ షుబ్లీ, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ మౌలానా, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# సత్య వరంలో పౌష్టికాహార్ పక్షోత్సవాలు

**మాడుగుల ఏప్రిల్ 17 జయ జయహే**

మాడుగుల మండలం సత్యవరం ఒకటో అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమశీ లో సిడిపిఓ ఎర్రయ్యమ్మ పాల్గొని మాట్లాడుతూ చిన్నారులను జంక్ ఫుడ్ లకు దూరంగా ఉంచాలని సూచించారు. వారికి ఆటపాటలతో కూడిన వికాసం అందించాలని సూచించారు ఎనిమిదవ పోషణ పక్వాడ లో భాగంగా గాదిరాయి అంగన్వాడి కేంద్రంలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రమణి, అంగన్వాడి కార్యకర్తలు జి జయమ్మ, ఎం అనురాధ, టి రమ, సూర్యమని తల్లులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి

**మాడుగుల ఏప్రిల్ 17 జయ జయహే**

మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేరిపించాలని కోరుతూ మాడుగుల బాలికల పాఠశాల ఉపాధ్యాయులు రాత్రి సమయంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తమ పాఠశాలలో జరుగుతున్న విద్యా విధానాన్ని వివరిస్తూ విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పించమని స్వచ్ఛందంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. దాన్లో భాగంగా శుక్రవారం రాత్రి ఎం గదబూరు గ్రామంలో ఉపాధ్యాయులు ఈ విధంగా ప్రచారం చేయడం గవర్నమెంట్ పాఠశాలల మనుగడకు పునాది లాంటిది.ప్రతి గ్రామంలో ఈ విధంగా చేస్తే పాఠశాలల మనుగడకు ఊతమిచ్చినట్టు అవుతుంది .ఇది హర్షించదగ్గ విషయం ఉపాధ్యాయు లు చేస్తున్న కృషికి స్పందిస్తూ ,విద్యార్థులు ప్రేరణ పొంది ,6వ తరగతినుండి 10 వ తరగతి వరకు ఉన్న పిల్లలను మా పాఠశాలలో జాయిన్ చేయమని ,జాయిన్ చేస్తే వచ్చే రకరకాల ఫెసిలిటీస్ ను వివరిస్తూ తిరగడం చాలా ముదావహం. ఈ విధానంపై గ్రామస్తులు ఉపాధ్యాయులను అభినందిస్తున్నారు.



# ముగిసిన రెండు విడతల జనగణన శిక్షణ కార్యక్రమాలు

**మాడుగుల ఏప్రిల్ 17 జయ జయహే**

జనాభా గణన 2027 కార్యక్రమంలో భాగంగా మూడు విడతలగా నిర్వహించ తలపెట్టిన యన్యుమరేటర్ల, సూపర్వైజర్ల శిక్షణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం తో రెండు విడుతల ముగిసింది. ఈనెల 9 నుంచి ఈ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మరల ఈనెల 20 నుంచి 22 వరకు మూడో విడత శిక్షణ ఈ కార్యక్రమాలు ముగుస్తాయి. ఈ సందర్భంగా ప్రతి విడుదల సుమారు యాభై మంది కి శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక తహసీల్దార్ కే రమాదేవి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా రెండో విడత ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ జనాభా గణన కార్యక్రమం విజయవంతం అయ్యేవిధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు అందరి చేత ప్రమాణం చేయించారు. ఈ జనాభా గణన లో భాగంగా మే ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మొదటి దశ గృహ జాబితా గృహ గణన కార్యక్రమం నిర్వహిస్తారు. 2027 ఫిబ్రవరి నుంచి జనగణ కార్యక్రమం చేపడతారు. తొలి దశలో గ్రామంలో ఎన్ని గృహాలు ఉన్నాయి ఆ గృహాలు ఏ దశలో ఉన్నాయి, వాటిలో ఎన్ని నిరుపయోగంగా ఉన్నాయి, ఎన్ని నివసియోగంగా ఉన్నాయి, ఎన్ని వ్యాపార కేంద్రాలుగా ఉన్నాయి వాటి వివరాలు సేకరిస్తారు. అలాగే ఆ గృహాల్లో ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయా లేవా అనే విషయాలపై కూడా సర్వే నిర్వహిస్తారు. రెండో విడతలో ఒక గృహంలో ఎంతమంది నివసిస్తున్నారు, నివాసం లేని గృహాలు ఏ దశలో ఉన్నాయి వంటి వివరాలను సహకరిస్తారు. ఈ విధంగా యూనిట్కు 200 గృహాలు చొప్పున లెక్కిస్తారు. సచివాలయ ఉద్యోగులు కార్యదర్శులు ఇందులో భాగస్వామ్యం అవుతారు. ఈ రెండో విడత శిక్షణలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ ప్రసాదు తదితరులు ఎన్ ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఎండిఓకే అప్పారావు కూడా తొలి రోజు పలు సూచనలు చేశారు.

# జ్ఞాపకాల పందిరిలో వైభవంగా కిలగాడ ప్రభుత్వ పాఠశాల శత వసంతాల వేడుక





### ఘనంగా ముగిసిన 120 వసంతాల వేడుకలు!

### పులకించిన పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు

### పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**ముంచంగిపుట్టు, (జయ జయహే)**

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం కిలగాడ ప్రభుత్వ పాఠశాల 120 వసంతాల వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. శత వసంతాల వేడుకల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గత రెండు రోజుల పాటు ఈ ఉత్సవాలను అత్యంత పండుగ వాతావరణంలో నిర్వహించారు. ముగింపు రోజు ఉత్సవాలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్( పిడి ) ఝాన్సీరామ్ పడాల్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎంతో ఘన



చరిత్ర, ప్రాముఖ్యత కలిగిన ఈ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పిన ఈ పాఠశాల అభివృద్ధిపై అధికారులు, ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు డాక్యుమెంటరీ ఆవిష్కరణ**

వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల 120 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం, చరిత్రను కళ్లకు కట్టేలా రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని పాఠశాల తొలితరం ఉపాధ్యాయులు వంతినిబ కొండయ్య, మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజుల చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు.

**సందడిగా బడి ప్రాంగణం.. మురిసిపోయిన పూర్వ విద్యార్థులు**

ఈ చారిత్రక ఘట్టాన్ని వీక్షించేందుకు పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు, స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పాఠశాల ప్రాంగణం రెండు రోజుల పాటు పాత జ్ఞాపకాలతో సందడి సందడిగా మారింది. 120 ఏళ్ల సుదీర్ఘ, ఘన చరిత్ర కలిగిన తమ బడి ఉత్సవాలకు హాజరు కావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని పలువురు పూర్వ విద్యార్థులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# లులూరు భూములపై రీ సర్వే సమీక్ష


**బుచ్చయ్య పేట జయ జయహే**

బుచ్చయ్యపేట మండలం లోపుడి పంచాయితీ లో. లులూరు భూములపై రీ సర్వే ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు తమరాన దాసుమాట్లాడుతూ లూ లూరు భూముల సర్వే ప్రక్రియ ఎటువంటి తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సుమారు 800 ఖాతాల్లో ఉన్న రైతులు చిన్న, సన్నకారు రైతులేనని, ఎక్కువగా 30 సెంట్లు నుంచి ఒక ఎకరా లోపు భూములు కలిగిన వారేనని తెలిపారు. పెద్ద రైతులు లేరని పేర్కొన్నారు.గతంలో ఎల్బీపురం సర్వేలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పూర్వకాలంగా వస్తున్న భూములను డాక్యుమెంట్లు లేకపోయినా సాగు చేస్తున్న రైతులకు ఇబ్బందులు కలగకుండా సర్వే చేయాలని అధికారులను కోరారు. ఎవరు సాగు చేస్తున్నారో వారికి అనుగుణంగా భూముల నమోదు జరగాలని సూచించారు.అదేవిధంగా, గత సర్వేల్లో ఉన్న లోపాలను గుర్తించి సరిదిద్దాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో , కోఆపరేటివ్ ప్రెసిడెంట్ దొండ శ్రీను, మండల ఉపాధ్యక్షుడు సాయం శేషు, డిప్యూటీ తాసిల్దార్ శ్రీరామ్ మూర్తి సర్వేర్ శ్రీనివాసరావు వీఆర్వో సుధాకర్. రైతులు,కిల్లి రాము, తమరాన నాయుడు బాబు, కిల్లి అచ్చం నాయుడు, కిల్లి సత్తిబాబు, చిట్టిబాబు, నూకరాజు, రాజేష్, గోవింద తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ నూకాంబిక అమ్మవారి పండుగ మహోత్సవంలో పాల్గొన్న కె.కె రాజు

**విశాఖపట్నం (జయ జయహే)**



విశాఖ ఉత్తర నియోజకవర్గం 48వార్డు ఇందిరానగర్-3 శ్రీ నూకాంబిక అమ్మవారి గ్రామ పండుగ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ పండుగ మహోత్సవంలో ముఖ్య అతిధిగా విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,సీనియర్ నాయకులు బొగ్గు శ్రీను,జిల్లా బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు నీలి రవి, 48వార్డు అధ్యక్షుడు డోప్ప శ్రీను,శంకర్,సారిపిల్లి సంతోష్, ఏం. సునీల్, హరికృష్ణ,భరత్, సిమ్మ శంకర్ రావు, రాజు, రాజమనసింగ్, కుమార్, దివాకర్, డి చిన్న బాబు, బి. కొండబాబు, డి అప్పారావు, కె రవికుమార్, నాగరాజు, బంగారయ్య, కార్తీక్, గంగా మహేష్, ఆశినబేగం, ఆలయ కమిటీ సభ్యులుడగ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సమస్యను పరిష్కరిస్తాం


## పబ్లిక్ గ్రీవెన్స్‌లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే వంశీ కృష్ణ





**విశాఖపట్నం, ఏప్రిల్ 17, జయ జయహే**

ప్రజా సమస్యల నెరవేర్చడమే ధ్యేయంగా కూటమి పాలన కొనసాగుతుందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సూర్యాబాగ్ జోన్ - 4 కార్యాలయంలో శుక్రవారం ఆయన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఇళ్ల మంజూరు, రోడ్లు, డ్రైనేజీ,సామాజిక పెన్షన్లు వంటి మౌళిక సదుపాయాల కల్పన వంటి సమస్యలు మాత్రమే తెలిపారు. నియోజకవర్గం ఓల్డ్ సిటీ కాబట్టి అన్ని పనులు పూర్తి చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. అతి త్వరలోనే నూతన పెన్షన్లు, ఇళ్లు మంజూరు కానున్నాయని, నియోజకవర్గ పరిధిలో వెంకటేశ్వర మెట్ట దేవస్థాన భూములదే పెద్ద సమస్యగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అయిన ఆ సమస్యను అతి త్వరలోనే పరిష్కరిస్తామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు మాత్రమే కాకుండా ఎన్నికల తర్వాత చెప్పిన ప్రతి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. అక్కడక్కడ పెండింగ్లో ఉన్న పనులను మరో రెండు, మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు.



# డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులు

**అనకాపల్లి (జయ జయహే)**

అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ క్రీడా మైదానంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ 51,వ వర్ధంతి సందర్భంగా మాట్లాడుతూ గొప్ప అధ్యాపకుడిగా,తత్వవేత్తగా, భారత రెండవ ఉప రాష్ట్రపతిగా దేశానికి విశేష సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా ఆయనకీ మా ఘన నివాళులు అర్పిస్తూ.. ఈ కార్యక్రమంలో నటభూషణ్ శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, శ్రీకాంత్, నరేష్, సురేష్, అబ్దుల్ కలాం సేవా సంఘం సభ్యులు, డి.వి.ఎన్. కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# వాసంశెట్టికి మార్గాని భరత్ అభినందనలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సీనియర్ కార్మిక నాయకుడు వాసంశెట్టి గంగాధరరావును మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ఘనంగా అభినందించారు. స్థానిక మార్గాని ఎస్టేట్స్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు.ఈ సందర్భంగా మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ, వాసంశెట్టి గంగాధరరావుకు నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉందని, కార్మిక రంగంలో ఆయన సేవలు విశేషమని కొనియాడారు. తన తండ్రి మార్గాని నాగేశ్వరరావుతో సమకాలికుడైన గంగాధరరావు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర కార్యదర్శి పదవికి సిఫారసు చేసినట్లు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటనే ఆమోదించి నియామక ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. రాజమండ్రి పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతానికి గంగాధరరావు సేవలను వినియోగించుకుంటామని పేర్కొన్నారు.వాసంశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ, 1984 నుంచి కార్మికుల సమస్యలపై పోరాడుతూ రాజకీయాల్లో కొనసాగుతున్నానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి ఇంత ముఖ్య బాధ్యత అప్పగించినందుకు జగన్‌కు, మార్గాని భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు లభించని గౌరవమైన పదవిని అందించిన భరత్ రామ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన అనుభవం, కార్యదక్షతను పూర్తిగా వినియోగిస్తానని, కార్యకర్తలకు ఎక్కడ సమస్య వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఇదే కార్యక్రమంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎస్.ఎం. సాదిక్ హుస్సేన్ మార్గాని భరత్ రామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను భరత్ అభినందించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసి వెంకట్రావు, మార్తి లక్ష్మి, పోలు విజయలక్ష్మి, సంకిస భవానీప్రియ, రొక్కం త్రినాధ్ తదితరులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# గోడపత్రికలు చూపిస్తున్న జిల్లా ఉపాధ్యక్షులు తమరామదాసు

**బుచ్చయ్య పేట జయ జయహే**

పోషకాహార లోపం వల్ల పిల్లల ఎదుగుదల బుద్ధి మాన్యం వంటి లోపాలు కలుగుతాయని జిల్లా ఉపాధ్యక్షుడు తమరాన దాసు అన్నారు పోషణ్ పక్వాడ్ 8వ వారోత్సవాలు సందర్భంగా బుచ్చయ్యపేట మండలం లోపూడి పంచాయితీ వద్ద పోషణ్ పక్వాడ్ గోడ పత్రికలు చూపించి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు తమ్రాన దాసు మాట్లాడుతూ పోషక ఆహారం లోపం వల్ల ఎద డానికి నేర్చుకోవడానికి మరియు అభివృద్ధి చెందడానికి అవసరమైన తగినంత పోషకాలు అందకపోవటం వల్ల పిల్లలు ఎదుగుదల లోపం ఉంటుందని ఆయన అన్నారు పిల్లలు వయసు తగ్గ బరువు లేకపోవడం శరీరానికి కావాల్సిన విటమిన్ ఖనిజాలు అందకపోవటం ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం వయసు కంటే తక్కువ పరిమాణంలో పిల్లలు పుట్టటం పుట్టినప్పుడు ఉండవలసిన దానికంటే తక్కువ బరువుతో పుట్టడం వలన పిల్లలు ఎదుగుదల లోపం ఉంటుందని అన్నారు అలాగే పుట్టిన పిల్లలకు తల్లిపాలు సరిగ్గా అందకపోవటం వలన కూడా పిల్లలు ఎదుగుదల లోపం ఉంటుందని ఆయన తెలిపారు అలాగే ఐదేళ్ల లోపు పిల్లలు మరణాలు మరియు తల్లిలు మరణాలు రేటు ఎక్కువగా ఉంటుందని అన్నారు శారీరిక మరియు మేధోపరమైన ఎదుగుదల కుంటూపడుతుందని అన్నారు పోషకాహార లోపం ఒక తరం నుండి మరో తరానికి పేదరికం కొనసాగే ప్రమాదం ఉంటుందని ఆయన అన్నారు కాబట్టి ప్రతి ఒక్కరూ అంగన్వాడి పరిధిలో అందిస్తున్న పోషకాహార విలువలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ అధ్యక్షులు దొండ శ్రీనివాసరావు మండల ఉపాధ్యక్షులు సాయం శేషు ఎల్ సింగవరం సర్పంచ్ వేపాడ మధు అంగన్వాడి సూపర్వైజర్ నిర్మల అంగన్వాడి కార్యకర్తలు లలిత .నూక రత్నం. జ్యోతి తదితరులు పాల్గొన్నారు

# అంధ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ





**సాగర్ నగర్, ఏప్రిల్ 17 (జయ జయహే)**

సాగర్ నగర్ లోని అంధ బాలికల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. రుచి, నాణ్యత చాలా బాగుందని మెచ్చుకున్నారు. పాఠశాలలో భోజనం, పరిశుభ్రత సహా బోధన ప్రమాణాలు ఉన్నతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఎంతో అనుభవమున్న సంగీత విద్వాంసులకు ధీటుగా చిన్నారులు లాస్య, మధురశ్రీ, శ్వేత, సాయిలక్ష్మి ఆలపించిన రామదాసు కీర్తన "పలుకే బంగారమాయేనా.." గీతాలాపనకు అబ్బురపడిన గంటా, వారి పాటలు వినడానికి ప్రత్యేకంగా ఒక రోజు వస్తానని చెప్పారు. భోజనం వేళ ప్రార్థన.. కంచాలు, పాత్రలు శుభ్రంగా ఉంచుకోవడం.. స్పర్శ ద్వారా సహచరులను గుర్తించడం.. విద్యార్థినుల క్రమశిక్షణ చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఒకటో తరగతి నుంచి ఈ పాఠశాలలో చదివి, డీఎస్సీలో ఇదే పాఠశాలకు టీచర్ గా ఎంపికైన విద్యార్థిని మంగమ్మను అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ.. తన కుమార్తెను కూడా ఇదే పాఠశాలలో చదివిస్తున్న పూర్వ విద్యార్థిని రమణమ్మ స్ఫూర్తిమంతమైన ప్రస్థానాన్ని మెచ్చుకున్నారు. అంధుల ప్రపంచ క్రికెట్ కప్ ను గెలుచుకున్న భారత జట్టులో సభ్యురాలైన పాఠశాల విద్యార్థిని కరుణకుమారి విశాఖకే కాకుండా రాష్ట్రానికి గర్వకారణమన్నారు. రోటరీ క్లబ్ సహకారంతో పాఠశాలలో నిర్మించిన డార్మెటరీ, టాయ్ లెట్లు, దివీస్ చేపట్టిన అభివృద్ధి పనులను.. అలాగే డిస్పెన్సరీని పరిశీలించారు. విద్యార్థినులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్న క్రికెట్, షాట్ ఫుట్ క్రీడల శిక్షణకు ప్రాధాన్యమిస్తున్నామని ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. మ్యూజిక్ టీచర్ ఉంటే మరింత మెరుగ్గా సంగీత సాధన చేయగలుగుతారని ఆమె చెప్పారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపించరన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, చెట్టుపల్లి సన్యాసిరావు, లొడగల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## హైకోర్టు జడ్జి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**విశాఖపట్నం, ఏప్రిల్ 17, జయ జయహే**

జిల్లాలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ శుక్రవారం పరిశీలించారు. ఎండాడ సన్ ఇంటర్నేషనల్ స్కూల్ పక్కన నిర్మించనున్న జ్యుడిషియల్ బిల్డింగ్ శంకుస్థాపన ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమం సమయం.... ఎంతమంది హాజరవుతారు అనే విషయాలను పక్కగా తెలుసుకొని దానికి తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలని భీమిలి ఆర్డీవో, జీవీఎంసీ అధికారులకు సూచించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా, అతిథులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.





## 2027లో వారణాసి ప్రభంజనం తప్పదు

## 2029లో సీఎంగా జగన్ రాక ఆగదు

**జగనన్న పాటకు నృత్యం చేసిన వాసుపల్లి...**

**అమ్మవారి ఆశీస్సులతో ఈ పండుగను అధికారికంగా నేనే నిర్వహిస్తా!**

**వాడబలిజల దుర్గాలమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి**

**విశాఖపట్నం (జయ జయహే)**

సూపర్ స్టార్ మహేష్ బాబు వారణాసి చిత్రం 2027లో ప్రభంజనం మాదిరిగా ఆంధ్రప్రదేశ్లో రానున్న 2029 ఎన్నికల్లో దుర్గాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం తథ్యమని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పష్టం చేశారు.ఆ విధంగా జరిగితే ఇక్కడ పండుగ జాతరను తానే అధికారికంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తానని వాసుపల్లి గణేష్ కుమార్ బహిరంగంగా వెల్లడించారు. 34వార్డు కొబ్బరి తోట వాడబలిజి (మత్స్యకార) ల ఆధ్వర్యంలో జరిగిన దుర్గాలమ్మ జాతర మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైసిపి పూర్వ వైభవం తీసుకురావడంలో తన వంతు బాధ్యతను నిర్వహిస్తానని చెప్పారు. మత్స్యకారుల (వాడబలిజ)ల శ్రీ దుర్గాలమ్మ జాతర మహోత్సవానికి రూ. 50,000 విరాళం అందజేసిన వాసుపల్లి గణేష్ కుమార్ శుక్రవారం జరిగిన ఈ వేడుకలకు హాజరయ్యారు. నూతన ఉత్సాహంతో జాతరలో అధినేత జగన్మోహన్ రెడ్డి చిత్రపటం పట్టుకుని స్టేజిపై నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబం పై ఉండాలని ఆకాంక్షించారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, కష్టసుఖాల్లోనే కాకుండా ప్రతి పండుగలో తాను భాగస్వామ్యం చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకార నాయకులు వాసుపల్లి ధనరాజు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 34వ వార్డు మాజీ కార్పొరేటర్ తోట పద్మావతి, దక్షిణ నియోజకవర్గ వైసిపి వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు



## ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కదలండి...!

**వైసీపీ శ్రేణులకు మాజీ మంత్రి కురసాల పిలుపు**

**విశాఖపట్నం, ఏప్రిల్ 17, జయ జయహే**

ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే దిశగా కదలాలని వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పిలుపునిచ్చారు. విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెం, కృష్ణ కాలేజ్ రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వార్డు, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి సమిష్టిగా పని చేయాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని త్వరితగతిన వార్డు మరియు సచివాలయ కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ ,మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ,విజయనగరం, విశాఖ జిల్లా పరిషత్ చైర్మన్ లు మజ్జి శ్రీనివాసరావు , జల్లిపల్లి సుభద్ర ,అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డెటి ప్రసాద్ , శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి , సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్ ,పెట్ల ఉమాశంకర్ గణేష్ ,మొల్లి అప్పారావు , తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య ,శోభ హైమవతి , నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కష్టపడి పని చేసి పార్టీ ప్రతిష్ట పెంచండి..!

**విశాఖ టిడిపి అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం పిలుపు**

**విశాఖ పట్నం, ఏప్రిల్ 17, జయ జయహే :**

మనపై నమ్మకం ఉంచి తెలుగు దేశం పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి పని చేసి పార్టీకి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని విశాఖ పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం కోరారు. శుక్రవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో కొత్తగా నియమితులైన టీడీపీ కమిటీ సభ్యులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిత్యం కష్టపడి పనిచేయా లన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరేటట్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ మాట్లాడుతూ టీడీపీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ పదవులు వస్తూనే ఉంటాయని, పార్టీకి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చే వారిని పార్టీ అధిష్టానం ఎప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## కలెక్టర్ని కలిసిన సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ

**విశాఖపట్నం, ఏప్రిల్ 17, జయ జయహే**

విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ని దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు .ఈ సందర్భంగా నియోజవర్గం సంబంధించిన పలు అంశాలను వివరించడంతో పాటు నియోజవర్గం అభివృద్ధికి సహకరించాలని కోరారు .అదే విధంగా పెండింగ్లో ఉన్న పలు అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయడానికి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా శాలువా వేసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు విశాఖలో సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు

**మధురవాడ జోన్ ఆఫీస్లో నిర్వహణ**

**సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంబాబు వెల్లడి**

**విశాఖపట్నం, ఏప్రిల్ 17, జయ జయహే**



ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం విశాఖపట్నం జోన్-3 డివిజన్, మధురవాడ సబ్ డివిజన్ ఆఫీస్లో శనివారం సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జీ. శ్యాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధురవాడ సబ్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే మీటింగ్ లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను చైర్ పర్సన్, సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అదేవిధంగా విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తారని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించవచ్చని సూచించారు. ఈసదస్సులో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్ పర్సన్, విశ్రాంతి జడ్జి బి సత్యనారాయణతో పాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు మల్లాది విజయ చాముండి, ఎస్. సుబ్బారావు, ఎన్. మురళీకృష్ణ పాల్గొంటారని తెలిపారు.



## రైల్వే స్టేషన్లో 'బైక్ టాక్సీ' పికప్ పాయింట్

**ప్రారంభించిన డీఆరఎం బోహ్రా**

**విశాఖపట్నం, ఏప్రిల్ 17, జయ జయహే :**

విశాఖ రైల్వే స్టేషన్లో ప్రయాణికుల సౌకర్యార్థం వాల్తేరు డివిజన్ రైల్వే సరికొత్తగా 'బైక్ టాక్సీ' పికప్ పాయింట్ను వాల్తేరు డీఆరఎం లలిత్ బోహ్రా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరీక్షణ సమయం తగ్గించి, ప్రయాణికులకు వేగవంతమైన రవాణా అందించడమే ఈ సేవ లక్ష్యంగా పేర్కొన్నారు. మహిళలు, వృద్ధుల భద్రత దృష్ట్యా ప్రత్యేక శిక్షణ పొందిన డ్రైవర్లను కేటాయించామన్నారు. స్టేషన్ నుండి గమ్యస్థానానికి సురక్షితంగా, త్వరగా చేరుకోవడానికి ఈ సేవ ఎంతగానో తోడ్పడుతోందని, వేలాది ప్రయాణికులు రోజువారీగా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా రైల్వే విభాగం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్ కుమార్, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ పూజా సింగ్, స్టేషన్ డైరెక్టర్ ఏ.ఎం. ఉబాలే తదితర అధికారులు పాల్గొన్నారు.

# పిల్లలు మాట వినడం లేదా?

## పేరెంటింగ్ టిప్స్ సూచిస్తున్న నిపుణులు

**'వేలెడంత లేదు, చెప్పిన మాట అస్సలు వినదు', 'తన వయసెంత, అప్పుడే అంత కోపం' అంటూ పిల్లల ప్రవర్తన గురించి ఫిర్యాదులు చెప్పే పేరెంట్స్ చూసే ఉంటాం. దీనికి కారణం ఏదైనా పిల్లలను బాధ్యుల్ని చేయడానికి ముందు మీరూ కొన్ని విషయాలను అర్థం చేసుకోవాలంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!**



పాటించాలి : ఏ విషయాన్నైనా పదేపదే చెబితే పిల్లలకు నచ్చకపోవచ్చు. వారికి ఏదైనా చెబుతుంటే, దాన్ని ముందు పెద్దవాళ్లు పాటించి నప్పుడే వారూ అనుసరిస్తారు. పేరెంట్స్‌ను స్ఫూర్తిగా తీసుకుంటారు.

ఆదర్శంగా ఉండండి : పిల్లలు ఏ విషయమైనా పేరెంట్స్‌ను చూసి నేర్చుకుంటారు. మీరు ఇతరుల మాట విన్నప్పుడే, వారు కూడా మీ మాట వింటారు. అలాగే, వారు మీ మాట విన్నప్పుడు లేదా ఏదైనా మంచి పని చేసినప్పుడు తప్పకుండా మెచ్చుకోండి. ఇది వారు మళ్లీ అలాగే ప్రవర్తించేలా ప్రోత్సహిస్తుంది.

మీరూ చేయండి : ముందు చిన్నారులను కోపం తెప్పించే సందర్భాలు, పరిస్థితులను అర్థం తెలుసుకోండి. ఎలాగంటే, బొమ్మల్లో, పుస్తకాల్లో సర్దిపెట్టుకోమంటే, చేయకపోవచ్చు. అలాగని వాళ్లను తిట్టో, కొట్టో దారికి తెచ్చుకోవడానికి ప్రయత్నించొద్దంటున్నారు నిపుణులు. అలా చేస్తే వారు మరింత మొండిగా మారతారట.

చిన్నారుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకపోయినా కొన్ని పనులు క్రమశిక్షణను అలవరుస్తాయి. పిల్లలు ఏవైనా సర్దుతుంటే మీరూ సాయం చేస్తానని చెప్పండి. ఒకవేళ వాటిని సరైన స్థానంలో పెట్టకపోతే తనే ఆర్గనైజ్ చేసుకోవాల్సి వస్తుందని ముందే హింట్ ఇస్తే, వారు క్రమంగా మారతారట.

తాయిలాలు ఇవ్వొద్దు : బ్రేక్‌ఫాస్ట్, లాంచ్ చేయడానికి పిల్లలు కొన్నిసార్లు మొండిగా ప్రవర్తిస్తుంటారు. వాళ్లకి ఇష్టం లేనిది చేస్తే, కోపంతో అరిచేస్తుంటారు. భోజనం చేయకుండా మారాం



చేస్తారు. ఇదే అలవాటుగా మారితే, భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవంటున్నారు నిపుణులు. దీన్ని ముందే గుర్తించి నివారించాలని చెబుతున్నారు. అలా కాకుండా భోజనం చేస్తే టీవీ పెడతాను, చాక్లెట్ ఇస్తాను లాంటి అనవసరమైన హామీలు ఇవ్వకండి. బదులుగా మీరు వండే పదార్థాల్ని మెచ్చేలా మరో రకంగా ఎలా చేయొచ్చో ఆలోచించండి. లేదంటే, పోషకాల లోపం వాళ్లలో అసహనాన్ని మరింత పెంచొచ్చట.

మీరే నేర్పాలి : చిన్నారులు కొన్నిసార్లు ఇతరులతో పోల్చుకుంటారు. మరికొన్ని సార్లు నచ్చింది కావాలని మారాం చేస్తుంటారు. లేదంటే, ఇంకేదైనా విషయానికి కోపం తెచ్చుకుంటారు. గట్టిగా అరవడం, ఏడవడం, మొండిగా ప్రవర్తించడం వంటివన్నీ చేస్తారు. ఇలాంటి ఇబ్బందికరమైన పరిస్థితుల్లోనూ మీరు సంయమనంతో వ్యవహరించాలని నిపుణులు చెబుతున్నారు. వాళ్లతో ప్రశాంతంగా మాట్లాడండి. ఈ క్రమంలో వాళ్ల కోపాన్నీ బాధనీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. అవసరమైతే మీరే రాజీకి రావాలి. ఆ తర్వాత చిన్నారులు దిగొచ్చేలా చేయండి. ఇలా భావోద్వేగాలను నియంత్రించుకోవడం నేర్పితేనే భవిష్యత్తులో సంతోషంగా ఉండగలరు.

వాదనలొద్దు : మన పిల్లలే కదా, కోప్పడొచ్చని పేరెంట్స్ భావించకూడదు. వారితో మాట్లాడేటప్పుడు గొంతును వీలైనంత తక్కువ స్థాయిలో ఉంచి మృదువుగా మాట్లాడాలంటున్నారు నిపుణులు.

# గూగుల్ జెమినై కొత్త ఫీచర్

**నీట్ అభ్యర్థుల కోసం ప్రాక్టీస్ టెస్టులు**




**పరీక్ష తర్వాత తక్షణ ఫీడ్‌బ్యాక్, వ్యక్తిగత స్టడీ ప్లాన్ సౌకర్యం ప్రస్తుతం ఇంగ్లీష్‌లో అందుబాటులో ఉన్న ఈ ఫీచర్**

టెక్ దిగ్గజం గూగుల్, భారతదేశంలోని వైద్య విద్య అభ్యర్థులకు అండగా నిలుస్తూ కీలకమైన ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. తన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ప్లాట్‌ఫామ్ అయిన జెమినైలో నీట్ యూజీ కోసం పూర్తిస్థాయి ప్రాక్టీస్ టెస్టులను ప్రవేశపెట్టింది. వాస్తవ పరీక్ష వాతావరణాన్ని తలపించేలా ఈ మాక్ టెస్టులను రూపొందించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన శిక్షణ అనుభవాన్ని అందించడమే లక్ష్యమని కంపెనీ పేర్కొంది. గూగుల్ జెమినైలో ఈ ఫీచర్‌ను ఉపయోగించడం చాలా సులభం. 'Take a NEET mock test' అని ప్రాంప్ట్ ఇవ్వడం ద్వారా విద్యార్థులు ఈ ప్రాక్టీస్ టెస్టులను ప్రారంభించవచ్చు. వివిధ విద్యా వేదికల నుంచి సేకరించిన, నిపుణులతో ధృవీకరించబడిన నాణ్యమైన కంటెంట్‌తో ఈ టెస్టులను రూపొందించారు. ప్రస్తుతం ఈ సదుపాయం ఇంగ్లీష్ భాషలో అందుబాటులో ఉంది. గూగుల్ అకౌంట్ ఉన్న వినియోగదారులతో పాటు వర్క్‌స్పేస్ సబ్‌స్క్రైబర్లు కూడా ఈ టెస్టులను యాక్సెస్ చేసుకోవచ్చు. ఈ ప్రాక్టీస్ టెస్టుల ప్రత్యేకత ఏమిటంటే, పరీక్ష పూర్తయిన వెంటనే తక్షణ ఫీడ్‌బ్యాక్ లభిస్తుంది. విద్యార్థుల బలాలు, బలహీనతలను ఇది స్పష్టంగా విశ్లేషిస్తుంది. అంతేగాక సమాధానాలను మరింత వివరంగా చెప్పమని ఏఐ అసిస్టెంట్‌ను అడగవచ్చు. విద్యార్థుల పనితీరు ఆధారంగా పర్సనలైజ్డ్ స్టడీ ప్లాన్‌లను కూడా జెమినై రూపొందిస్తుంది. తద్వారా విద్యార్థులు తమ నాలెడ్జ్ గ్యాప్స్‌ను గుర్తించి, ఫలితాలను మెరుగుపరుచుకునేందుకు ఇది ఎంతగానో సహాయపడుతుంది.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం గూగుల్ తన ఏఐ టూల్స్‌ను విస్తరించడంలో భాగంగానే ఈ కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. ఇప్పటికే ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన జేఈఈ మెయిన్ వంటి వాటి కోసం పూర్తిస్థాయి ప్రాక్టీస్ టెస్టులను అందిస్తోంది. దీంతో పాటు స్టడీ గైడ్స్, క్విజ్‌లు, ఇతర లెర్నింగ్ మెటీరియల్‌ను సృష్టించేందుకు కూడా ఏఐ ఫీచర్లను అందిస్తోంది. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు అసైన్‌మెంట్లు రూపొందించడానికి, విద్యార్థుల పనితీరును సమీక్షించడానికి, వ్యక్తిగత ఫీడ్‌బ్యాక్ ఇవ్వడానికి కూడా గూగుల్ ఏఐ టూల్స్ ఉపయోగపడతాయి. బాధ్యతాయుతమైన ఏఐ వినియోగానికి కట్టుబడి ఉన్నామని, డిజిటల్ లెర్నింగ్ రంగంలో పారదర్శకతను పెంచేందుకు కృషి చేస్తున్నామని గూగుల్ స్పష్టం చేసింది.

**ఎండాకాలంలో చాలామందికి ఎదురయ్యే సమస్యల్లో చర్మం కందిపోయి నల్లగా మారడం కూడా ఒకటి. మరి, అలా జరగకుండా ఉండడానికి బయటికి వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకుంటారు చాలామంది. అయితే, సూర్యుడి నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాలతో పోరాడే శక్తి మనం ఆహారంగా తీసుకునే కొన్ని పదార్థాలలోనూ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందులో ఉండే కొన్ని రకాల పోషకాలు, సమ్మేళనాలే చర్మంపై ఎండ పడినప్పుడు కందిపోకుండా కాపాయడతాయంటున్నారు. ఎండ కారణంగా చర్మం కందిపోకుండా ఉండడానికి పండ్లు ఎంతగానే సహకరిస్తాయంటున్నారు నిపుణులు.**



# ఎండల్లో చర్మం నల్లగా మారిపోతుందా?

## ఇలా చేస్తే మెరిసే కాంతి మీ సొంతం!

ముఖ్యంగా, దానిమ్మ, స్ట్రాబెర్రీ, జామ వంటి పండ్లలో ఉండే పోషకాలు ఇందుకు బాగా దోహదం చేస్తాయని చెబుతున్నారు. ఈ క్రమంలో దానిమ్మలో పుష్కలంగా లభించే ఎల్లాజిక్ ఆమ్లం సూర్మరశ్మి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు శరీరంపై పడకుండా అడ్డుకుంటుందని పేర్కొంటున్నారు. అలాగే, చర్మంలో కొత్త కణాలను ఉత్పత్తి చేసి చర్మ ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది.

స్ట్రాబెర్రీ : ఇందులో అధికంగా లభించే విటమిన్ సి కూడా యూవీ కిరణాలను అడ్డుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, బ్లూబెర్రీ, రాస్ప్బెర్రీ వంటివి కూడా ఎండ నుంచి చర్మాన్ని రక్షించడంలో సమర్థంగా పనిచేస్తాయంటున్నారు.

జామపండు : ఏ కాలంలోనైనా విరివిగా లభించే జామపండులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఎండ నుంచి చర్మాన్ని రక్షించడంతో పాటు చర్మ క్యాన్సర్, ఇతర శరీర సంబంధిత సమస్యలు రాకుండా సంరక్షిస్తుందని నిపుణులు చెబుతున్నారు. వీటితో పాటు యాపిల్, కివీ, పుచ్చకాయ వంటి పండ్లూ చర్మానికి ఎండ నుంచి రక్షణ కల్పిస్తాయంటున్నారు.

ఎండాకాలంలో చాలామందికి ఎదురయ్యే సమస్యల్లో చర్మం కందిపోయి నల్లగా మారడం కూడా ఒకటి. మరి, అలా జరగకుండా ఉండడానికి బయటికి వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకుంటారు చాలామంది. అయితే, సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలతో పోరాడే శక్తి మనం ఆహారంగా తీసుకునే కొన్ని పదార్థాలలోనూ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందులో ఉండే కొన్ని రకాల పోషకాలు, సమ్మేళనాలే చర్మంపై ఎండ పడినప్పుడు కందిపోకుండా కాపాయడతాయంటున్నారు. ఎండ కారణంగా చర్మం కందిపోకుండా ఉండడానికి పండ్లు ఎంతగానే సహకరిస్తాయంటున్నారు నిపుణులు. ముఖ్యంగా, దానిమ్మ, స్ట్రాబెర్రీ, జామ వంటి పండ్లలో ఉండే పోషకాలు ఇందుకు బాగా దోహదం చేస్తాయని చెబుతున్నారు. ఈ క్రమంలో దానిమ్మలో పుష్కలంగా లభించే ఎల్లాజిక్ ఆమ్లం సూర్మరశ్మి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు శరీరంపై పడకుండా అడ్డుకుంటుందని పేర్కొంటున్నారు. అలాగే, చర్మంలో కొత్త కణాలను ఉత్పత్తి చేసి చర్మ ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది.

స్ట్రాబెర్రీ : ఇందులో అధికంగా లభించే విటమిన్ సి కూడా యూవీ కిరణాలను అడ్డుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, బ్లూబెర్రీ, రాస్ప్బెర్రీ వంటివి కూడా ఎండ నుంచి చర్మాన్ని రక్షించడంలో సమర్థంగా పనిచేస్తాయంటున్నారు.

జామపండు : ఏ కాలంలోనైనా విరివిగా లభించే జామపండులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఎండ నుంచి చర్మాన్ని రక్షించడంతో పాటు చర్మ క్యాన్సర్, ఇతర శరీర సంబంధిత సమస్యలు రాకుండా సంరక్షిస్తుందని నిపుణులు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com